
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

# ఆపరేషన్ గ్రీన్స్ కింద నెల్లూరుకు కేటాయించిన ప్రాజెక్టుల పరిస్థితి ఏంటి?



**నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త** ప్రధానమంత్రి కిసాన్ సంపద యోజన పథకం కింద దీర్ఘకాలిక లక్ష్యంతో ఆపరేషన్ గ్రీన్స్‌లో భాగంగా సముద్ర రంగంలో రొయ్యలకు సంబంధించి రూ. 158 కోట్ల అంచనా వ్యయంతో 2 ప్రాజెక్టులను నవంబర్ 2022లో నెల్లూరు జిల్లాలో కేంద్రం ఆమోదించిందని, ఆ ప్రాజక్టుల ప్రస్తుత పరిస్థితి ఏంటని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం లోక్‌సభలో ఆయన పలు అంశాలపై ఆరా తీశారు. ఆమోదించబడిన ప్రాజక్టుల్లో ఒకటి పూర్తయిందనేది వాస్తవమేనా, అలా అయితే రెండవ ప్రాజెక్టు స్థితిగతులేంటని, ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవు తుందో తెలియజేయాలన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. ఆపరేషన్ గ్రీన్స్ స్కీమ్ ప్రధాన మంత్రి కిసాన్ సంపద యోజన కింద దీర్ఘకాలిక లక్ష్యాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాకు సముద్ర రంగంలో రొయ్యలకు సంబంధించిన రెండు ప్రాజెక్టులను మంత్రిత్వ శాఖ ఆమోదించిందని చెప్పారు. ఇందులో ఆల్ఫా మెరైన్ లిమిటెడ్ అనే ఒక ప్రాజెక్ట్ పూర్తయిందని, మరొక ప్రాజెక్ట్ ఫాల్కన్ మెరైన్ ఎక్స్ పోర్ట్స్ లిమిటెడ్ 12.12.2024న రద్దు చేయబడిందన్నారు. ప్రాజెక్ట్ ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆమోద పత్రం ప్రకారం ప్రాజెక్టును అమలు చేయడంలో విఫలమైన కారణంగా ప్రాజెక్టు రద్దయిందని వివరించారు.

## ఆత్మకూరులో అభివృద్ధి పనులు



**ఆత్మకూరు,ఫిబ్రవరి7,ప్రభాతవార్త :** ఆత్మకూరు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం కానున్నాయని రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. పట్టణంలో ఆదివారం వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి నలుగురు మంత్రుల పర్యటన ఉన్న నేపథ్యంలో ఆ యన అందుకు సంబంధించిన ఏర్పాట్ల ను స్థానిక యంత్రాంగంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న బిసి బాలికల గురుకుల పాఠశాల, టిడ్కో గృహ సము దాయంకు సంబంధించి రామాలయ నిర్మాణం, ఆత్మకూరులో నిర్మించనున్న పంచాయతీరాజ్ అతిథి గృహ భవనం, ఆత్మకూరులో ముస్తాబైన ఆర్‌అండ్‌బి అతిథిగృహాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం మంత్రుల పర్యటనకు సంబంధించి ఎటువంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా జరిగేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ పావని, డియస్పీ వేణుగోపాల్, టిడిపి నాయకులు, అధికార యంత్రాంగం పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా వినూత్న ఆలోచన




**నెల్లూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఇంటింటి చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే వ్యర్థాలను అందించాలని ప్రచారం చేస్తున్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేస్తున్న ప్రజల ఆలోచనలో మార్పు తీసుకువచ్చేందుకు కమిషనర్ సూర్య తేజ వినూత్నంగా ఆలోచించారు. స్థానిక 48వ డివిజన్ విరాట్ నగర్, వి.బి.ఎస్. కళ్యాణ మండపం సమీపం లో,54 వ డివిజన్ వెంకటేశ్వరపురం,అలాగే కరెంటు ఆఫీసు సెంటర్ వివిధ ప్రాంతాలలో బహిరంగ ప్రదేశంలో వ్యర్థాలు వేయవద్దని, చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే అందించాలని పలు మార్లు విజ్ఞప్తులు చేసి ఉన్నప్పటికీ, స్థానికులు పెడచెవిన పెట్టారని తెలిపారు. స్థానిక ప్రజల ఆలోచనల్లో మార్పు తీసుకురావాలని నిర్ణయించి, వ్యర్థాలు వేస్తున్న ఆ ప్రదేశాన్ని పారిశుధ్య కార్మికుల ద్వారా శుక్రవారం నాడు నీళ్లతో శుభ్రం చేసి, రంగు రంగుల ముగ్గులతో, పూలకుండీలు అమర్చి సుందరంగా తీర్చిదిద్దారు. దానితో ఆ ప్రాంతంలో వ్యర్థాలు వేయాలన్న ఆలోచన ప్రజల మనసులో నుంచి తొలగిపోయింది అని కమిషనర్ ప్రకటించారు. నగర ప్రజలంతా చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే వ్యర్థాలను అందించి స్వచ్ఛ నెల్లూరు సాకారానికి తోడ్పడాలని కమిషనర్ ఆకాంక్షించారు.

## ప్రజాసేవలోనే జీవితాన్ని గడిపిన మహోన్నత వ్యక్తి గ్రంధి యానాదిశెట్టి
### కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి



**కావలి, ఫిబ్రవరి07 ప్రభాతవార్త** కావలి మాజీ మున్సిపల్ ఛైర్మన్, మాజీ ఏఎంసి ఛైర్మన్ ప్రముఖ దివంగత వైశ్యనేత గ్రంధి యానాదిశెట్టి ప్రజాసేవలోనే జీవితపు తనువును చాలించిన మహోన్నతవ్యక్తి గ్రంధి యానాదిశెట్టి అని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. అందరివాడుగా పేరు గడించిన గ్రంధి కాంశ్య విగ్రహ నిర్మాణం తన స్వంత నిధులతో చేపట్టడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. శుక్రవారం కావలి పొట్టిశ్రీరాములు సెంటర్‌లో మాగుంట పార్వతమ్మ ట్రంకురోడ్డులో గ్రంధి యానాదిశెట్టి కాంశ్య విగ్రహ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. టెంకాయకొట్టి భూమిపూజ ప్రారంభించారు. ఈ సందర్భంగా దగుమాటి మాట్లాడారు. గ్రంధి తనకెంతో ఆప్తులన్నారు. ఆయన సేవలు మరువలేనివన్నారు. 1987లో కాంగ్రెస్‌పార్టీ కౌన్సిలర్‌గా గెలుపొందారన్నారు. వైస్‌ఛైర్మన్‌గా కొనసాగారన్నారు. 1995 నుంచి 2000ల వరకు వైస్‌ఛైర్మన్‌గా కొనసాగారన్నారు. 2000ల సంవత్సరం నుంచి 2005 వరకు మున్సిపల్ ఛైర్మన్‌గా పనిచేశారన్నారు. కొన్ని సంవత్సరాలపాటు కావలి మున్సిపాలిటిలో చక్రంతిప్పిన రాజకీయనేత గ్రంధి అన్నారు. వ్యవసాయ మార్కెటింగ్ కమిటి ఛైర్మన్‌గా పనిచేశారన్నారు. నిరంతర ప్రజాసేవలోనే ఆయన కొనసాగారన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులోఉంటూ ప్రజాసేవకుడుగా కొనియాడబడ్డారన్నారు. కావలి టిడిపి అద్యక్షుడుగా పనిచేసిన గ్రంధి యానాదిశెట్టిని కోల్పోవడం దురదృష్టకరమన్నారు. చిన్న, పెద్ద తేడాలేకుండా ద్విచక్రవాహనంపై వారిని ఎక్కించుకుని పనులు చేసిన దిట్ట గ్రంధి అని కొనియాడారు. కుల, మతాలకు తావులేకుండా ప్రజాసేవచేసిన మహనీయులు గ్రంధి అన్నారు. అలాంటి వ్యక్తి కాంశ్యవిగ్రహాన్ని తన స్వీయనిధులతో నాచేతులమీదుగా నిర్మించడం పూర్వజన్మ సుకృతమన్నారు. కావలి ప్రజల హృదయాలలో గ్రంధి చెరగనిముద్ర వేసుకున్నారన్నారు. తన రాజకీయ గురువు, మా అమ్మ, మాజీ ఎంపి, మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ మాగుంట పార్వతమ్మ పేరును కావలి ట్రంకురోడ్డుకు నామకరణం చేయడం తన అదృష్టమన్నారు. వారి అడుగుజాడల్లో నడుస్తూ కావలి రూపురేఖలుమార్చి కనకపట్నంగా చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి శాసనసభ్యులు కాకార్ల సురేష్ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. రాజకీయంగా గ్రంధి యానాదిశెట్టి తెలియనివారంటూలేరన్నారు. ఆయన నిరంతరం ప్రజాసేవలోనే పునీతమయ్యారన్నారు. కావలి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఎంతగానో పాటుపడుతున్నారన్నారు. కావలి, ఉదయగిరి నియోజకవర్గాల అభివృద్ధికి ఇద్దరం పాటుపడతామన్నారు. ఉదయగిరి నియోజకవర్గంతో అన్న ఎమ్మెల్యే దగుమాటికి ఎంతో సత్సంబంధాలు ఉన్నాయన్నారు. గ్రంధి కుమార్తెలు మాజీ మున్సిపల్ ఛైర్మన్ పోతుగంటి అలేఖ్య, చలువాది వసుధ, నేరెళ్ల లావణ్య, అల్లుళ్లు చలువాది వెంకటేశ్వర్లు, న్యాయమూర్తి నేరెళ్ల శ్రీనివాసులు, పోతుగంటి శ్రీకాంత్, గ్రంధి కుమారుడు రమేష్‌బాబుల ఆధ్వర్యంలో ఈ విగ్రహానికి భూమిపూజ జరిగింది. ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిని వారు ఘనంగా స్వాగతం పలికారు. దుశ్శాలువాలతో సత్కరించి పూలబొకె అందచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అద్యక్షుడు గుత్తికొండ కిషోర్‌బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబురావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మాజీ ఏఎంసి ఛైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ మండల అద్యక్షుడు నాయుడు రాంప్రసాద్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుండ్లపల్లి భరత్‌కుమార్‌యాదవ్, బిజెపి నేతలు సివిసి సత్యం, కుట్టుబోయిన బ్రహ్మానందం, అమరా వెంకటసుబ్బారావు, వైసిపినేత అమరా యాదగిరి సుబ్బరాయుడు గుప్తా, కన్యకాపరమేశ్వరి ఆలయకమిటి బాధ్యులు బచ్చు వీరాస్వామి, ఓలేటి నాగేశ్వరరావు, నల్లూరు రోశయ్య, రాజారమణయ్య, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరక్టర్ తటవర్తి వాసు, తిరివీధి ప్రసాద్, బృందావనం శ్రీరాంమాల్యాద్రి, ఆర్యవైశ్య సంఘం అద్యక్షులు తటవర్తి రమేష్, ఆర్యవైశ్యసంఘం సభ్యులు, బిజెపి, జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, ఫిబ్రవరి7, ప్రభాతవార్త** : మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం సాయంత్రానికి 1268 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయంలో 65.416 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్‌ఎఫ్‌సికి 350, ఎన్‌ఎఫ్‌సికి 650, పెన్నా డెల్టాకు 2800, కండలేరు వరద కాలువకు200 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 98.834మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# రామాయపట్నం పోర్టు ఆధారిత పరిశ్రమల స్థాపనకు భూములు పరిశీలించిన రాష్ట్ర పరిశ్రమల, వాణిజ్య శాఖల కార్యదర్శి యువరాజ్



**ఉలవపాడు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త** శుక్రవారం జిల్లాలోని రామాయపట్నం పోర్టు పరిసర ప్రాంతాల్లోని భూములను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌తో కలిసి రాష్ట్ర పరిశ్రమల, వాణిజ్య శాఖల కార్యదర్శి యువరాజ్ పరిశీలించారు. తొలుత జిల్లా పర్యటనకు విచ్చేసిన పరిశ్రమల వాణిజ్య శాఖల కార్యదర్శి ఎన్.యువరాజ్‌కు జిల్లా కలెక్టర్ మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం అలగాయపాలెం వ్యవసాయ భూములను పరిశీలించారు. కరేడు చెరువును పరిశీలించి ఆయకట్టు వివరాలను తెలుసుకున్నారు. చెరువులో నీరు సమృద్ధిగా ఉండటం చూసి వర్షాధారమా లేక ప్రాజెక్టు ద్వారా నీరు నింపారా అని విచారించారు. అనంతరం టెంకాయచెట్లపాలెం గ్రామ పరిధిలోని భూములను పరిశీలించారు. మ్యాప్‌ల సహాయంతో ప్రభుత్వ, పట్టా భూముల వివరాలను జిల్లా కలెక్టర్ వివరించారు. అనంతరం కావలి రూరల్ అనెమడుగు గ్రామ పంచాయతీలోని స్వరాయపాలెం, అనెమడుగు గ్రామాల భూ ములను పరిశీలించారు. ఇప్పటికే వివిధ పరిశ్రమలకు కేటాయించిన భూమి వివరాలను ఆరా తీశారు. అనంతరం చెన్నాయపాలెం భూములను పరిశీలించి నేరుగా రామాయపట్నం పోర్టుకు చేరుకున్నారు. పోర్టు పరిధిలో నిర్మాణంలో ఉన్న ఇండోసోల్ సోలార్ ఎనర్జీ ప్లాంట్‌ను సందర్శించారు. ప్లాంట్‌లో కలియతిరిగి పనుల పురోగతి గురించి కంపెనీ ప్రతినిధులను విచారించారు. మారిటైం బోర్డు సీఈఓ ప్రవీణ్ ఆదిత్య, కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ, కావలి ఆర్డీఓ వంశీకృష్ణ, రామాయపట్నం రాజశేఖర్, తహశీల్దార్లు, ఇతర అధికారులు ఉన్నారు.



# ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు
### కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్,ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని కార్పొరేషన్ కు చెందిన రిజర్వ్ ఓపెన్ ఖాళీ స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని, ఆయా నిర్మాణాలను తప్పనిసరిగా కూల్చివేస్తామని కమిషనర్ సూర్య తేజ హెచ్చరించారు. స్థానిక 38వ డివిజన్ రమేష్ రెడ్డి నగర్, ఆచారి స్ట్రీట్, సి.ఎ.ఎం హై స్కూల్ పరిసర ప్రాంతాలలో కమిషనర్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణను శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ కు చెందిన రిజర్వ్ ఖాళీ స్థలాలు, ప్రభుత్వ స్థలాలను గుర్తించి మార్కింగ్ చేయమని సిటీ ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు అలాగే ప్రైవేటు స్థలాలను వాటి యజమానులే శుభ్రం చేసుకునేలా నోటీసులు జారీ చేసి వార్డ్ సచివాలయ అడ్మిన్, శానిటేషన్, ప్లానింగ్, అమెనిటీస్ కార్యదర్శులు పర్యవేక్షించాలని సూ చించారు. ప్రధాన కాలువలను 15 రోజులకు ఒకసారి తప్పనిసరిగా శుభ్రం చేసి పూడిక తీత పనులను చేపట్టాలన్నారు. స్థానిక డివిజన్ పరిధిలో జరుగుతున్న సిమెంటు రోడ్ల నిర్మాణం పనులను, ప్యాచ్ వర్క్ పనులను పరిశీలించారు. ప్రస్తుత రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపించి ఉందని, నిర్మించిన రెండు సంవత్సరాలకే ధ్వంసం అయిపోవడంతో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికా రులకు సూచించారు. సి.ఏ.ఎం స్కూల్, పాత జైలు, పెట్రోల్ స్టేషన్ తదితర ప్రాంతాలలో పర్యటించిన కమిషనర్ ఆయా ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పెట్రోల్ స్టేషన్ నిర్వాహకులకు సూచించారు. స్థానిక పంటకాలువలో పూడికతీత పనులు చేపట్టి, సమీపంలోని ఖాళీ స్థలాల్లో ఆహ్లాదంగా వుండేందుకు మొక్కల పెంపకాన్ని చేపట్టాలని సూచించారు. స్థానిక రియాజ్ హోటల్ నిర్వాహకులు వాడేసిన కుండలు, కవర్లను పక్కనే ఉన్న పంట కాలువలో పడేస్తున్నట్లు గుర్తించిన కమిషనర్ హోటల్ నిర్వాహకులకు జరిమానా విధించాలని ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. హోటల్ సిబ్బందితోనే వంటకాలువను శుభ్రం చేయించాలని సూచించారు. ఆస్తి పన్ను బకాయి ఉన్న డి.ఆర్. ఉత్తమ్ హోటల్ నిర్వాహకులు ఈరోజు సాయంత్రం లోగా బకాయి మొత్తాన్ని చెల్లించేలా డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. వై.ఎం.సి.ఏ గ్రౌండ్ ఎదురుగా ఉన్న పంట కాలువను ఆక్రమిస్తూ నిర్మిస్తున్న నిర్మాణాన్ని వెంటనే ఆపేయాలని కమిషనర్ ఆదేశించారు. అక్రమ నిర్మాణాలను గుర్తించక, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న స్థానిక ప్లానింగ్ సెక్రటరీకి షోకాజు నోటీసులు జారీ చేయమని కమిషనర్ ఆదేశించారు. డివిజన్ పరిధిలో జరుగుతున్న ఇంజనీరింగ్ పనులను వేగవంతంగా పూర్తి అయ్యేలా పర్యవేక్షిస్తున్నామని కమిషనర్ తెలిపారు. డివిజన్ పరిధిలో క్రమం తప్పకుండా డ్రైను కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులు జరిగేలా స్థానిక సచివాలయ కార్యదర్శులు పర్యవేక్షించాలని సూ చించారు. డివిజన్ పరిధిలో విద్యుత్ వీధి దీపాలు అన్ని ప్రాంతాలలో ఏర్పాటు చేసి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కాలువల వెంబడి జంగిల్ క్లియరెన్స్ చేయించి మురుగునీటి ప్రవాహానికి ఎలాంటి అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. అనంతరం ఏ.సీ. కూరగాయల మార్కెట్ అన్న క్యాంటీన్ ను కమిషనర్ సందర్శించి ప్రజలకు అందుతున్న ఆహార నాణ్యతను తనిఖీ చేశారు. క్యాంటీన్లకు వచ్చే ప్రజలకు టోకెన్ విధానం ద్వారానే ఆహారాన్ని అందించాలని కమిషనర్ నిర్వాహకులకు సూచించారు. క్యాంటీన్ ను గతంలో తనిఖీ చేసినప్పుడు సూచించిన మార్పులను అమలు చేయకపోవడంపై నోడల్ అధికారిగా ఉన్న ఆరోగ్యశాఖ అధికారికి షోకాజ్ నోటీసులు జారీ చేయమని కమిషనర్ ఆదేశించారు. టేక్కేమిట్టలోని పాత హెల్త్ ఆఫీసరు క్వార్టర్స్ శిధిలావస్థలో ఉన్నందున వెంటనే దాన్ని పగులకొట్టించాలని ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ. ని ఆదేశించారు. స్థానిక వార్డు సచివాలయ రెవెన్యూ కార్యదర్శి, వార్డ్ ప్లానింగ్ కార్యదర్శి విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్నారని కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ. రామ్ మోహన్ రావు, మాజీ మేయర్ నంది మండలం భానుశ్రీ ,హెల్త్ ఆఫీసర్ డాక్టర్. చైతన్య, వెటర్నరీ డాక్టర్ మదన్మోహన్,ఈ.ఈ. శేషగిరిరావు, ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్, రెవిన్యూ ఆఫీసర్ ఇనాయతుల్లా, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రికే సాధ్యం : ఎమ్మెల్యే



**కొడవలూరు(విడవలూరు), ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం పల్లెలు ప్రగతి బాట ఏర్పడుతున్నాయని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో 5 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్డు ప్రారంభోత్సవనికి ఎమ్మెల్యే రావడంతో టిడిపి కూటమి నాయకులు, మహిళలు అడుగడుగునా హారతులతో స్వాగతం పలికారు. ఆమెషాదీ మంజిల్ షాదీ మంజిల్ ఆధునీకరణ పనులకై ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో 10 లక్షలు సిఎస్ఆర్ నిధులు మంజూరు చేశారు. మండల వ్యవసాయ శాఖ కార్యాలయ మరమ్మత్తుల కోసం5 లక్షల కేటాయించారు. స్థానిక ప్రాథమిక వైద్యశాలను ఎమ్మెల్యే సందర్శించి వసతుల లేమిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపి నిధుల ద్వారా హాస్పిటల్‌లో టాయిలెట్స్ తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తానన్నారు. అనంతరం ఆమె ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ గత ఐదేళ్లలో జరిగిన అరా కొరా పనులు కూడా కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా అసంపూర్తిగానే ఉన్నాయి. రోడ్లు, డ్రైన్లు లాంటి అభివృద్ధి పనులు స్థానిక నాయకులే నాణ్యతను పాటించి పూర్తి చేయాలని కోరారు. ఇళ్ళు లేని ప్రతి ఒక్కరికి మార్చిలో ఇళ్ల స్థలాలు ఇస్తామని తెలియజేశారు. గతంలో తట్టెడు మట్టి కూడా వేయలేని పరిస్థితిలో వున్న గ్రామీణ ప్రాంతాలలో డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీ రాజ్ మంత్రి అయ్యాక కొత్త రోడ్డు నిర్మాణాలు జరుగుతున్నాయి. ఒక్క కొడవలూరు మండలంలోనే గత 7 నెలలలో 6 కోట్ల 50 లక్షల అభివృద్ధి పనులు చేసాం మరో 1 కోటి నిధులున్నాయన్నారు. అట్టడుగు వర్గాలకు ముఖ్యమంత్రి పాలనలోనే న్యాయం జరుగుతుంది. స్థానిక నాయకులు గ్రామీణ సమస్యలపై దృష్టి సారించాలని అధికారులతో మమేకమై ప్రజా సమస్యలు తీర్చడంలో చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు స్ఫూర్తి రెడ్డి, ఎంపీడీవో సుబ్బారావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి జి ఎన్ శేఖర్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు వెంకటరమణా రెడ్డి, మండల పార్టీ ఇంచార్జి ముంగమూరు శ్రీహరి రెడ్డి, బెజవాడ వంశీకృష్ణా రెడ్డి, గ్రంధాలయ మాజీ ఛైర్మన్ మందిపాటి ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిలానీబాషా, కేతు వెంకటరమణా రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు పంది శ్రీనివాసులు, కరకట్ట మల్లికార్జున్, కోవూరు వెంకీ, నాయబ్, తువ్వార ప్రవీణ్ కుమార్, మిక్కిలింపేట, గౌతమ్ నగర్ సర్పంచులు కోడూరు చంద్రశేఖర్ రెడ్డి, నాగిరెడ్డి సునీల్, యల్లాయపాలెం మాజీ సర్పంచ్ బడుగు శ్రీనివాసులు, భూలోకం విజయకుమార్, కోడూరు సుధాకర్ రెడ్డి, నక్క రమ ణయ్య, పవన్ కుమార్, మురళి, శశంత్,గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దేవకుమార్, ఈవోపీఆర్డి సాయిప్రసాద్, మండల వ్యవసాయ అధికారిని సిహెచ్ శ్రీలక్ష్మి, పాల్గొన్నారు.

# బైకుల చోరీ ముఠా అరెస్ట్ : 56 మోటార్ సైకిళ్ల స్వాధీనం





**నెల్లూరు క్రైమ్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** వ్యసనాలు ఒకటి చేశాయి. చెడు వ్యసనాలకు బానిసై నలుగురు ఒక ముఠాగా ఏర్పడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఈ ముఠాను నెల్లూరు జిల్లా పోలీసులు పట్టుకున్నారు. ముఠా కదలికలపై నిఘా ఉంచిన నెల్లూరు సీసీఎస్, కొడవలూరు పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 56 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం నెల్లూరు ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో ఎస్పీ జి. కృష్ణకాంత్ నిందితుల వివరాలను వెల్లడించారు. ఆయన పేర్కొన్న సమాచారం మేరకు అల్లూరు మండలం నార్త్ ఆములూరుకు చెందిన ఎ.శివ చెడువ్యసనాలకు బానిసయ్యాడు. 2017లో హత్యాయత్నం కేసులో పోలీసులు అతనిని అరెస్ట్‌చేసి జైలుకు పంపారు. బెయిల్‌పై బయటకు వచ్చిన అతడు తన చిన్నమ్మ కుమారుడైన రవిదుర్గతోకలిసి బైక్ దొంగతనాలు చేస్తూ పోలీసులకు చిక్కి ఇద్దరూ జైలుపాలయ్యారు. అనంతరం పాతనేరస్థులైన అల్లూరు మండలం చవటపాలెం గ్రామానికి చెందిన కె. నాని, హోసన్నలను కలుపుకుని ముఠాగా ఏర్పడి రాష్ట్రంలోని పలు జిల్లాలో బైక్ దొంగతనాలకు పాల్పడసాగారు. ఇటీవల బైక్ దొంగతనాలు అధికమైన నేపథ్యంలో జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ ఆదేశాల మేరకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌లు సిహెచ్ సీతారామయ్య, అశోక్, కొడవలూరు సిఐ సురేంద్రబాబు తమ సిబ్బందితో ప్రత్యేక బృందంగా ఏర్పడి బైక్ దొంగతనాలు, నిందితుల కదలికలపై నిఘా ఉంచారు. ఈనెల ఆరోతేదిన వారు కొడవలూరు మండలం పద్మనాభ సత్రం వద్ద వాహనతనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదం గా కనిపించిన నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు. నెల్లూరు జిల్లాలో 24, తిరుపతి జిల్లాలో 21, ప్రకాశం జిల్లాలో 8, బాపట్ల, వైఎస్సార్ కడప, తూర్పు గోదావరి జిల్లాల్లో మూడు బైక్‌లు మొత్తంగా రూ. 30లక్షలు విలువచేసే 56 బైక్‌లను దొంగలించినట్లు నిందితులు అంగీకరించడంతో వారిని అరెస్ట్ చేశారు. వారి వద్దనుంచి బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసుల ఛేదనలో ప్రతిభ కనపరిచిన సీసీఎస్, కొడవలూరు సిఐలతో పాటు కొడవలూరు, విడవలూరు, సీసీఎస్ ఎస్‌ఐలు కోటిరెడ్డి, నరేష్, వెంకటాద్రినా యుడుతో పాటు వారి సిబ్బందిని ఎస్పీ అభినందిం చి నగదుప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సమావేశంలో ఎఎస్పీ సిహెచ్ సౌజన్య, నెల్లూరు, నెల్లూరు రూరల్ డిఎస్పీలు పి. సింధుప్రియ, ఘట్టమనేని శ్రీనివాసరావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌లు సీతారామయ్య, అశోక్ కుమార్, కొడవలూరు సిఐ సురేంద్రబాబు, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

## బాలికోన్నత పాఠశాలలో శుభదిన్ తిథి భోజన్



**కోవూరు, ఫిబ్రవరి 7ప్రభాతవార్త :** కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 700పైగా విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకులు సురేష్ తన తండ్రి నరసింహులు జ్ఞాపకార్థం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన శుభదిన్ కా భోజన్ పథకాన్ని గ్రామాల్లోని పెద్దలు, నాయకులు, వ్యాపారస్తులు ఎవరైనా వారింట్లో శుభాకార్యాలు సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజన సమయాల్లో వారికి నచ్చింది ఏర్పాటు చేసే అవకాశం ప్రభుత్వాలు కల్పించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సురేష్‌ను ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

## ప్రతినెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం



**కోవూరు ఫిబ్రవరి 7 ప్రభాతవాం :** జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని పంచాయతీలు ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు. జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి తెలిపారు. కోవూరు గ్రామపంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం సాయంత్రం అయిన ఆకస్మికంగా పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. జిల్లా వ్యాప్తంగా ఉన్న 722పంచాయతీలలో 170 పంచాయతీలలో చెత్త నుండి సంపద కేంద్రాలు లేవని వాటిలో కూడా ఈ కేంద్రాలను మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మీద చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు అదేవిధంగా 15వ ఆర్థిక సంఘం నిధులు జిల్లాకు 40 కోట్ల మేర వచ్చాయని. ఆ నిధులను సక్రమంగా ఉపయోగించి అభివృద్ధి పనులు వేగవంతం చేసేలా సంబంధిత పంచాయతీలు చొరవ తీసుకోవాలన్నారు అదేవిధంగా ప్రస్తుత సీజన్ లో దోమల నివారణకు అన్ని పంచాయతీలు ప్రత్యేకత దృష్టి సారించి ఫాగింగ్ కార్యక్రమాన్ని చేపట్టేలా చూడాలన్నారు మార్చి నెలాఖరులోగా నూరు శాతం పనులు వసూలు చేసేలా సంబంధిత పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి శ్రీనివాసులు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఉన్నారు

## పాల డెయిరీ ఏర్పాటుకు మహిళలు ముందుకు రావాలి



**కోవూరు, ఫిబ్రవరి 7ప్రభాతవార్త :** మహిళలు పాల డెయిరీ సహకార సంఘాల ఏర్పాటుకు ముందుకు వస్తే వారికి ఈ పాడికి సంబంధించిన విషయాలపై మరింత అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా డెయిరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. బాలకోటేశ్వరరావు తెలిపారు. కోవూరు మండలం పడుగుపాడు గ్రామంలో మహిళా పాల ఉత్పత్తి దారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా పాడి రైతులు తమ యొక్క పాల ఉత్పత్తులను మార్కెటింగ్ చేసే అవకాశాన్న మరింత సులభతరం చేసేలా సహకరిస్తామన్నారు. పాలలో వెన్నశాతం బట్టి రేటు చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా బీవీ సురేష్ , పశు వైద్యులు డాక్టర్ షబానా వారికి అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో పడుగుపాడు పరిధిలోని మహిళా పాల ఉత్పత్తిదారులు ఉన్నారు.

## హర్షం వ్యక్తం చేసిన ముస్లిం మైనార్టీ నాయకులు



**ఉదయగిరి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** ఉదయగిరి నియోజకవర్గ ముస్లిం మైనార్టీ నియోజకవర్గ అధ్యక్షులుగా ముత్తుజ హుస్సేన్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియమించడం జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ డైరక్టర్ గడియాల్సి ఎస్థాని ఉదయగిరి సర్పంచ్ పాములూరి సామ్రాజ్యం ఉదయగిరి ఎంపిటీసీ పెద్ద మస్తానీ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీకి శ్రమ పడిన వారిని గుర్తించి ఉదయగిరి వైసీపీఇన్ ఛార్జీ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాబోయే కాలంలో వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2.0 ముఖ్యమంత్రిగా చూడబోతున్నారని గతంలో కాకుండా పార్టీ కోసం శ్రమపడి కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని చెప్పిన దానికి ఉదయగిరి మైనార్టీ అధ్యక్షులుగా ఉప సర్పంచ్ ముత్తుజ హుస్సేన్‌ని నియమించడం ప్రారంభమైందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హక్కులరెడ్డి ఉప్పుటూరి శ్రీను, జబీన్ జబ్బర్ భాయ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభ్యున్నతికి కృషి చేయండి : తూమాటి



**ఉలవపాడు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** గ్రామాల అభ్యున్నతకు సర్పంచ్‌లు, కార్యదర్శులు ఐక్యంగా పాటుపడాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశానికి ఎంపీపీ వాయల మస్తానమ్మ అధ్యక్షత వహిం చారు. ఈ సందర్భంగా తూమాటి మాధవరావు మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాల్సి న పనులపై ముందస్తుగా సర్పంచ్‌లతో, కార్యదర్శులు సమీక్షించాలని పేర్కొన్నారు. వచ్చేది వేసవి కాలం కాబట్టి గ్రామాల్లో మంచినీటికి ఇబ్బనంది లేకుండా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఎన్.విజయ, తహశీల్దార్ లావణ్య, జడ్పీటీసీ చేవూరి అరుణ, వైస్ ఎంపీపీ ఫజల్, కోఆప్షన్ మెంబర్ ఖాదర్‌భాషా, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యాశాఖ కార్యాలయం ఎదుట గ్రామస్తుల ఆందోళన



**మర్రిపాడు, ఫిబ్రవరి7, ప్రభాతవార్త:** మండలంలోని ఏపిలిగుంట గ్రామస్తులు శుక్రవారం విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1954 నుండి ఏపిలిగుంటలో ప్రాథమిక పాఠశాల ఉందని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ పాఠశాలను ఇక్కడి నుండి బిసికాలనీలోని పాఠశాలకు తరలించేందుకు అధికారులు చేపట్టినట్లు తెలిపారు. ఏపిలిగుంట లోని మెయిన్ పాఠశాలను ఇక్కడే ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని పలుమార్లు మండల విద్యాశాఖ అధికారిని ధనలక్ష్మి దృష్టికి తీసుకెళ్ళేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందని వారు వాపోయారు. ప్రస్తుతం కూడా ఈ విషయంపై ఆమెకి వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చినా ఆమె అందుబాటులో లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి ఏపిలిగుంటలోని మెయిన్ పాఠశాలను బిసి కాలనీ పాఠశాలకు విలీనం చేయకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఛైర్మెన్ సుజాత, వైస్‌ఛైర్మెన్ శిరీష, గ్రామ ఉపసర్పంచ్ భారతి, విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కొత్తసత్రంలో అనధికార మద్యం అమ్మకాలపై దాడులు



**కావలి, ఫిబ్రవరి07 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం తుమ్మలపెంట పంచాయితీ కొత్తసత్రం గ్రామంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తులపై కావలి ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పొన్నపూడి శ్రీను వద్ద ఉన్న 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో కావలి పిఅండ్ఈఐ సి.ఐ ఎస్. శ్రీనివాసులు, ఎస్ఐ దేవిక, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడి తీరుపై విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం



**మర్రిపాడు, ఫిబ్రవరి7, ప్రభాతవార్త:** మర్రిపాడు మండలంలోని కదిరినేని పల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రవీంద్రబాబు తీరుపై విద్యార్థులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు విద్యార్థుల చేత కాళ్ళు, చేతులు వత్తించుకొని విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని విద్యార్థులు వాపోయారు. విద్యార్థులతో కాళ్ళు పట్టించుకొని విద్యార్థులకు స్వీట్లు ఇస్తున్నాడని విద్యార్థులు తెలిపారు. అంతేకాక ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు రవీంద్రబాబుతోపాటు మరో ఉపాధ్యాయురాలు ఇష్టానుసారంగా ఉంటూ మధ్యలోనే విధులనుండి వెళ్ళిపోతునా న్రని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. దీనిపై విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు. ఉపాధ్యాయులు మధ్యాహ్నం నుండి పాఠశాల నుండి వెళ్ళిపోవడం విద్యార్థులు స్కూల్ బయట పడిగాపులు కాస్తున్నామని వారు వాపోయారు. కావున ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## అధ్వానంగా పోకూరు సచివాలయ పనితీరు
## ఆకస్మికంగా తనిఖీచేసిన ఎంపీడీవో

**వలేటివారిపాలెం ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** మండలంలోని పోకూరు సచివాలయాన్ని శుక్రవారం వలేటివారిపాలెం ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఆర్.రమేష్ బాబు ఉదయం 11.30గం॥ సమయంలో తన అధికార పర్యటనలో బాగంగా ఆకస్మికంగా తనిఖీచేశారు. ఆసమయంలో పంచాయతీ కార్యదర్శితోపాటు 8 మంది సిబ్బంది ఉండాలి. కేవలం ఇద్దరే ఉన్నారు. దీంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. హాజరు పట్టీ పరిశీలించారు. కార్యాలయ కంప్యూటర్ అసిస్టెంటు జరీనాను సిబ్బంది వివరాలు అడిగారు. డిజిటల్ అసిస్టెంట్ మార్గమధ్యంలో ఉందని ఎంపీడీవోకి చెప్పారు. గైరుహాజరు సిబ్బంది వివరాలు మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో పొందుపరచాల్సి ఉంది. ఇక్కడి సిబ్బంది తాము ఉద్యోగులమన్న భావనతో వ్యవహరించడం లేదన్న అసహనం ఆయన వ్యక్తం చేశారు. కనీసం అధికారులు వచ్చారన్న భావనకూడా సిబ్బందిలో ఉండడంలేదు. అదేవిధంగా రైతు భరోసా కేంద్రం మూసివేసి ఉంది. సిబ్బంది అడ్రస్ లేరు. సిబ్బంది పనితీరు ఇలా ఉంటే ప్రజలకు ఏ మేరకు మేలు జరుగుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. సచివాలయ ఆవరణతోపాటు రైతు భరోసా కేంద్రం అపరిశుభ్రతకు నిలయంగా మారింది. ఆకులు అలుములతో నిండిపోయింది. పట్టించుకునే నాధుడే లేరు. ఉద్యోగాలు లేక అనేక మంది నిరుద్యోగులు అల్లాడుతున్నారు. పోకూరు సచివాలయంలోని పలువురు సిబ్బంది మాత్రం సీట్లలో కూర్చొని తరచూ పోన్‌లు మాట్లాడుతుండడం ప్రజలకు ఇబ్బందిగా ఉంది. అర్జీదారులను అగౌరంగా మాట్లాడుతున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అశ్రద్ధ కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. చంద్రమౌళి అనే వ్యక్తి పాడైపోయిన తాగునీటి బోర్‌లు రిపేరు చేయించమని సచివాలయం చుట్టూ రెండు నెలలుగా తిరుగుతున్నారు. అయినా పట్టించుకున్న నాధుడేలేరు. ఇటీవల మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన జనరల్ బాడీ మీటింగులో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తాగునీటి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అయినా పోకూరులో ఈయన సూచనలను పట్టించుకునే నాధుడేలేరు. పర్యవేక్షించాల్సిన మండలస్థాయి అధికారులు సైతం చూచీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

## ఎస్ఐ సేవలు ఆదర్శం



**మర్రిపాడు, ఫిబ్రవరి7, ప్రభాతవార్త:** మర్రిపాడు మండల ఎస్ఐ కాసుల శ్రీనివాసరావ్ సేవలు ఎంతో ఆదర్శనీయమని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు శేషం సుదర్శన్ , కొప్పాల రఘు అడ్వకేట్ సూర్యనారాయణ లు పేర్కొన్నారు. ఈసందర్భంగా శేషం సుదర్శన్ మాట్లాడుతూ జిఅల్లలో మెట్టప్రాంతమైన మర్రిపాడు పోలీస్‌స్టేషన్ ఆధునీకరణ చేసిన ఘనత శ్రీనివాసరావుకే దక్కుతుందన్నారు. మండలంలోని ప్రజలతో ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని అమలు పరుస్తూ స్కూల్స్ , కాలేజీల్లో విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాలతో పాటు రోడ్డు భద్రతా నియమాలు పాటించే పద్ధతులు గురించి చక్కగా అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఇటీవల గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ చేతుల మీదుగా విధినిర్వహణలో ప్రతిభ కనపరచినందుకు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారని ఇలాంటి ఎస్ఐ మర్రిపాడుకు రావడంపట్ల ప్రజలు సంతోషం వ్యక్తంచేస్తున్నారన్నారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## దయాగుణం చాటుకున్న ముఖేష్‌కుమార్



**మనుబోలు ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** మనుబోలు కోదండరామపురం గమ ళ్ళపాళెంకు చెందిన కుడమల సుబ్రహ్మణ్యంగౌడ్ అనే వ్యక్తి గత కొన్ని రోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతు డయాలసిస్ చేయించుకున్నారు. అంతే కాకుండా ఆయన భార్య కుడుమల లక్ష్మీకి షుగర్ వ్యాధి ఉంది ఈ షుగర్ వ్యాధి వల్ల కాలు ఇన్స్ఫక్షన్ గురైంది. వారి ఆర్థిక సమస్యలు తెలుసుకొని మనుబోలు ఎలక్ట్రికల్ షాప్ ముఖేష్‌కు మార్ , కాగితాలపూర్ రోడ్డులోని పంజాబీ దాబా అధినేత ప్రశాంత్ తమ వంతు ఆర్థిక సాయంగా పదివేల రూపాయాలు సహాయం అందించారు. వీరు చేసినటువంటి సాయాన్ని పలువురు అభినందించారు.

## సబ్సిడి రుణాల ధరఖాస్తుకు తేది పొడగింపు



**సీతారామపురం ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** అర్హులైన ప్రతి ఒక్కరు సబ్సిడి రుణాలకు ధరఖాస్తు చేసుకోవాలని మండల ఎంపిడిఓ ఎం.బాస్కర్ తెలిపారు. వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ మరియు ఇతర కార్పోరేషన్ల ద్వారా ఆర్థిక వెనుక బడిన వారికి జీవనోపాధి కల్పించే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం బిసి కార్పోరేషన్ ద్వారా 30 మంది ,కాపు కార్పోరేషన్ ద్వారా 4 గురుకి, ఒసి కార్పోరేషన్ ద్వారా 3 గురుకి, ఇబిసి కార్పోరేషన్ ద్వారా 2కి, కమ్మ కార్పోరేషన్ ద్వారా 2 ఇద్దరికి, ఆర్యవైశ్య కార్పోరేషన్ ద్వారా ఒక్కరికి మొత్తం 42 మందికి సబ్సిడి ద్వారా బ్యాంకు రుణాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. సబ్సిడి రుణాలకు ధరఖాస్తు చేయువారు వారి ధరఖాస్తును ఏపిఒ డిఎంఎంఎస్ నందు ఈనెల 16 వ తేదిలోపు ఆన్‌లైన్ చేయాలని ధరఖాస్తు దారుడు కులం సర్టిఫికేటు, పుట్టిన తేది సర్టిఫికేటు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు పోటో, బ్యాంకు పాస్ బుక్, సెల్‌పోన్ నెంబర్ తీసుకొని ఆన్‌లైన్ సెంటర్ నందు గాని, సమీప సచివాలయంలో కాని ధరఖాస్తు చేసుకోవాల్సింది కోరారు.

## అగ్రికల్చర్‌కి 9 గంటలు విద్యుత్ సరఫరా ఇస్తాం



**మనుబోలు ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** వ్యవసాయానికి 9 గంటలు విద్యుత్ సరఫరా చేస్తామని ట్రాన్స్‌కో ఏఇ అనీల్‌కుమార్ తెలిపారు. మనుబోలు సబ్‌స్టేషన్ పరిధిలోని వ్యవసాయదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఎప్పటిలాగే వ్యవసాయానాకి 9 గంటలు విద్యుత్ సరఫరా చేస్తామని విలేఖర్ల సమావేశంలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బకాయిలు సకాలంలో చెల్లించాలని మెరుగైన సేవలు పొందాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం జయప్రదం చేయండి



**ఉదయగిరి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్నటువంటి ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, మగ ఆరోగ్య సహాయకులకు 10న నిర్వహించే జాతీయ నులిపురుగల నివారణ కార్యక్రమంపై గండిపాలెం వైద్యాధికారిణి డాక్టర్ ఎం.శివకల్పన శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ పాఠశాలలు, కళాశాలలో ఉండే 6 నెలల నుండి 19 సంవత్సరాల లోపు బాల బాలికలకు ఒక మోతాదు ఆల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలు మధ్యాహ్న భోజన అనంతరం వేయడం జరుగుతుందని తెలిపారు. వారికి కేటాయించిన అంగన్‌వాడీ, పాఠశాలలు, కళాశాలలో మాత్రలను పంపిణీ చేయాలని వివరించారు. ఆశా కార్యకర్తలు ప్రతి గృహంను సందర్శించి గర్భవతులు, 0టు 2 ఇయర్స్, చిన్నారులు, 2 సంవత్సరాల నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారుల వివరాలు వారు తీసుకున్న టీకాలు వివరాలు సర్వే ద్వారా సేకరించాలని తెలియజేశారు. ఎల్‌సీడీసీ సర్వేను ఈనెల 12వ తేదీ వరకు తొలగించినట్లు ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విద్యాధికారి కలసపాటి వెంకట సుబ్బయ్య, సీహెచ్ఓ శివకుమారి, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్‌జీ నౌషద్‌బాబు పర్యవేక్షకులు చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మ విశ్వాసంతో వైకాల్యాన్ని జయించండి



**బుచ్చి ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** దివ్యాంగుల కోసం విపిఆర్ పౌండేషన్ ద్వారా 3 వందలకు పైగా బ్యాటరీ ట్రైసైకిళ్ళు అందజేశాం, 3 వేల రూపాయాలు ఉన్న దివ్యాంగుల పెన్షన్ 6 వేలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి దక్కిందని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం ఎంపిడిఓ కార్యాలయంలో దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వం సంస్థ కాంపోజిట్ రీజినల్ సెంటర్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. సిఆర్‌సి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిల్స్, వినికిడి యంత్రాలు అందజేశారు. వెంకటాచలంలోని సిఆర్‌సి సెంటర్‌లో యిచ్చే నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు ట్రైసైకిళ్ళు, వినికిడి యంత్రాలు పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో వైస్ ఛైర్మన్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి, వైస్ ఛైర్‌పర్సన్ పఠాన్ నస్రీన్, కోడూరు కమలాకర్‌రెడ్డి, కౌన్సిలర్ అందె ప్రత్యూషా, పుట్టా లక్ష్మీకాంతమ్మ, కౌన్సిలర్ రాచూరు సత్యనారాయణ, కౌన్సిలర్ రహమత్, కౌన్సిలర్ శ్రీదేవి, నాగరాజు, కౌన్సిలర్ కోటంరెడ్డి లలితారెడ్డి, బెల్లం మల్లారెడ్డి, నాయకులు ఎం.వి శేషయ్య, జొన్నవాడ దేవస్థానం మాజీ ఛైర్మన్ పుట్టా సుబ్రమణ్యం నాయుడు, నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి, కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు, ఎంపిడిఓ శ్రీహరి, వింజం రామానాయుడు, సూరా శ్రీనివాసులురెడ్డి, రేబాల శ్రీనివాసు లురెడ్డి, మైనార్టీనాయకులు పఠాన్ మహబూబాషా, దుగ్గిశెట్టి హరినాద్, వింజం మహేష్‌నాయుడు, నెల్లూరు దయాకర్‌రెడ్డి, హరిరెడ్డి, బిజెపి మండల పార్టీ అధ్యక్షులు మనోహర్, శ్రీకాంత్‌రెడ్డి, పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు , కూరగాయాల మార్కెట్ రత్నం, శ్రీనివాసులు, తిరిపాలయ్య, ప్రదీప్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిసి కార్పొరేషన్ రుణాల దరఖాస్తు గడువు 12 వరకు ఎంపిడిఓ శ్రీదేవి



**కావలి, ఫిబ్రవరి07 ప్రభాతవార్త :** ప్రభుత్వం అందచేస్తున్న బిసి కార్పొరేషన్ రుణాలను అర్హులందరికి అందచేసేందుకు రుణాల దరఖాస్తు గడువు ఫిబ్రవరి 12 వరకు పెంచినట్లు కావలి ఎంపిడిఓ శ్రీదేవి తెలిపారు. లబ్దిదారులనుంచి వస్తున్న వినతులను దృష్టిలో పెట్టుకుని బిసి, ఈడబ్ల్యుఎస్, కాపుసహా వివిధ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో మంజూరు చేస్తున్న యూనిట్లకు దరఖాస్తుల గడువును ఈ నెల 12వ తేదీవరకు పెంచడం జరిగిందన్నారు. అర్హులైన నిరుద్యోగ యువత స్వయం ఉపాధియూనిట్ల స్థాపన కొరకు దరఖాస్తులు ఈ నెల 12 లోపల అప్లై చేసుకోవాలని ఎంపిడిఓ శ్రీదేవి తెలిపారు.

## వైస్ ఛైర్మన్ యరటపల్లి శివకుమార్‌రెడ్డికి సన్మానం



**బుచ్చి ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీ వైస్ ఛైర్మన్‌గా ఎన్నికైన యరటపల్లి శివకుమార్‌రెడ్డిని సచివాలయం సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగాసన్మానించారు. సచివాలయం సిబ్బంది వినోద్, సాయిబాబా, నారాయణ, విజయ్‌కుమార్, హజరత్, రాజశేఖర్, రాఘవరెడ్డి నగర సచివాలయం సిబ్బంది, శాంతినగర్ సచివాలయం సిబ్బంది శివకుమార్‌రెడ్డిని శాలువాలు కప్పి, పూల మాలలు వేసి సన్మానించారు. శివకుమార్‌రెడ్డికి వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## పవన్‌కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు



**నెల్లూరు, ఫిబ్రవరి07 ప్రభాతవార్త-విద్య :** అనారోగ్యానికి గురై చికిత్స తీసుకుంటున్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ త్వరగా కోలుకుని ఆరోగ్యవంతులుగా ఉండాలని జనసేన జిల్లాశాఖ ఆధ్వర్యంలో నగరంలోని స్థానిక ఆమని గార్డెన్స్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూనెమల్లికార్జున యాదవ్, గునుకుల కిషోర్, కృష్ణారెడ్డి, రామిరెడ్డి, ఏటూరి రవికుమార్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## బుద్ధవిహార్‌లో మాతా రమాబాయి జయంతి వేడుకలు




**కావలి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** కావలి పట్టణం బుద్ధవిహార్‌లో మాతా రమాబాయి జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉపాసికుల సంగీత కార్యక్రమం అందరిని అకట్టు కుంది. మాతా రమాబాయి గొప్పతనాన్ని అందరూ కొనియాడారు. అంబేద్కర్ గొప్పచదువులు చదివారంటే దాని వెనుక రమాబాయి త్యాగం ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి గురప్ప, కావలి మండల ఎంఈఓ గోవిందయ్య, బుద్ధిష్టులు అరవ రాయప్ప, దాసరి సుందరం, సోషల్‌వర్కర్ ఎం.మాలకొండారెడ్డి, జైభీం జెఎసి అధ్యక్షులు అంబటి కొండలరావు, అంబేద్కర్ బుద్ధవిహార్ పూజల జయప్రకాష్, మరిపూడి, మాచర్ల, ఉదయభాస్కర్, న్యాయవాది వెంకటేశ్వర్లు, మేడికొండ సుకుమార్, గోపి, కుదారి మస్తాన్, భవాని ఎడ్యుకేషన్ డైరక్టర్ సింహాద్రి, దేశయ్య, విజయ్, జ్యోతి, పూజల మమత, ప్రసన్న, పాల్గొన్నారు.

## అన్ని గ్రామాల్లో పనులు ప్రారంభించాలి : ఏపీడీ



**లింగసముద్రం, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** కొలతల ప్రకారం పనులు చేస్తూ సమయపాలన పాటించాలని ఏపీడీ జే.బాబురావు చెప్పారు. శుక్రవారం మండలంలోని ఆర్ఆర్‌పాలెం, లింగసముద్రం, మొగిలిచర్ల గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు చేసే వేతనదారులతో మాట్లాడారు. కనీసం 4 గంటల పాటు పని చేయాలని, అధికంగా ఫారం ఫండ్ పనులు చేయాలని తెలిపారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీడీ గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు అందరికి పని కల్పించేలా చూడాలని, అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ప్రారంభించాలన్నారు. నిబందనల ప్రకారం పనులు చేయించాలని ఈ సమావేశంలో ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు, ఏపీవో సమీర్ భాష, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## పరిసరాల విజ్ఞాన విషయంపై విద్యార్థులలో అవగాహన పెంచాలి



**ఉదయగిరి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి మండల విద్యాశాఖాధికారి-1 షేక్ మస్తాన్ వలి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉదయగిరి దళితవాడ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి 3,4,5 తరగతుల విద్యార్థుల అభ్యసన, పఠన సామర్థ్య నైపుణ్యాలనుగణిత, పరిసరాల విజ్ఞానం విషయాలలో పరిశీలిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను వారి తరగతి స్థాయికి తగ్గట్టుగా ఉన్నవని, అయితే పరిసరాల విజ్ఞాన విషయంలో చుట్టూ ఉండే పరిసరాలను అనుసంధానిస్తూ బోధన చేయడం వలన విద్యార్థులు త్వరితగతిన అవగాహన చేసుకుంటారని తెలియజేశారు. తదుపరి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. స్కూల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్ పనులను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి గణిత,ం ఆంగ్ల విషయంలో పాఠశాల అనంతరం విద్యార్థులతో ఒక గంటసేపు డ్రిల్లింగ్ చేయించాలని ఉపాధ్యాయులకు తెలియజేశారు. పాఠశాల యొక్క అన్ని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ షబ్బీర్, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఓబుల్‌రెడ్డిని పరామర్శించిన ఆదాల



**వింజమూరు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి గురువారం సాయంత్రం గుండెమడగల గ్రామ నివాసి మాజీ ఎఫ్సీఐ డైరక్టర్ అంకినపల్లి ఓబుల్‌రెడ్డిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంకినపల్లి ఓబులరెడ్డి సతీమణి కౌసల్యమ్మ ఇటీవల కాలం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపధ్యంలో మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఓబుల్‌రెడ్డిని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఓబుల్‌రెడ్డిని ఆయన తనయుడు శివశంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారితో పాటు నెల్లూరు విజయడైయిరి చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రైల్వే బోర్డు సభ్యులు స్వర్ణ వెంకయ్య, ఏపీ స్టేట్ ఎంఎస్ఎంఈ మాజీ డైరక్టర్ పాశం శ్రీనివాస్, సీనియర్ నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, మాజీ హౌసింగ్ బోర్డు డైరక్టర్ హరిబాబు యాదవ్, జడ్పీటీసీ సభ్యులు మల్లు సుధాకర్‌రెడ్డి, వైసీపీ మహిళా నాయకురాలు కల్లూరు లక్ష్మీ రెడ్డి, వైసీపీ నాయకులు కొండేటి నరసింహారావు, షేక్ మొయిద్దీన్, బెల్లంకొండ వెంకయ్య, నాని తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు కంప్యూటర్ బహుకరణ



**వింజమూరు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** వింజమూరు మండలం గుండెమడగల ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు కంప్యూటర్లను శుక్రవారం బహుకరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు గోపిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో 2003-04 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు ఇటీవల పాఠశాలలో ఘనంగా నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో తాము చదివిన పాఠశాలకు తమ గుర్తుగా ఏదో ఒకటి మంచి కార్యక్రమం విద్యార్థులకు ఉపయోగపడే విధంగా చేయాలని తలచి కంప్యూటర్ ఆవశ్యకత ఎంతైనా అవసరం ఉందని భావించి కంప్యూటర్ బహుకరించడం ఆనందదాయకమన్నారు. ఆత్మీయ సమావేశంలో నాటి విద్యార్థులుగా నేడు ఉన్నత పదవుల్లో ఉండి నేటి ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల చదువు ఉద్యోగం వ్యాపారం రంగాలలో ఉన్న విషయాలను పలు జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకుని ఆనందంగా గడపడం ఇలా ఒకరిని ఒకరు కలుసుకోవడం అంతా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇతర ఉపాధ్యాయ బృందం, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు యూటీఎఫ్ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్టు

**వింజమూరు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** ఉదయగిరి నియోజకవర్గం ఎనిమిది మండలాల పరిధిలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠవాల నందు ఆదివారం ఉదయం 10గంటలకు పదో తరగతి విద్యార్థులకు వింజమూరు మండల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో యూటీఎఫ్ మెగా టాలెంట్ టెస్టు జరుగుతుందని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ గాలం చెంచలబాబు తెలియజేశారు. కావున నియోజకవర్గంలోని పదో తరగతి విద్యార్థులు అందరూ టాలెంట్ టెస్టులో పాల్గొని తమ ప్రతిభను చాటి విజేతలుగా నిలిచి బహుమతులు పొందాలని కోరారు.

## ఘనంగా స్వర్ణకారుల వార్షిక వేడుకలు

**నెల్లూరు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త -వైద్యం :** నగర నియోజకవర్గ పరిధిలోని కొరడా వీధి ప్రాంతంలో శుక్రవారం సింహపురి స్వర్ణకార కార్మిక పరస్పర సహాయక సహకార సంఘం ఏర్పాటు చేసుకుని 14 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఆ సంఘ వార్షికోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన 47వ డివిజన్ కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణ, టీడీపీ బీసీ సెల్ సెక్రటరీ ధర్మవరం సుబ్బారావు, డివిజన్ అధ్యక్షుడు ఈ.చెంగయ్య, డి.గణేష్ కుమార్ కేక్ కటింగ్ అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా మనమందరం కోరుకుంది ఒకటే. రాష్ట్రంలో స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్న విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు. మంగళగిరిలో 60 ఎకరాల భూమిని కేటాయించి స్వర్ణకారులకి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమన్నారు. అలాగే మున్సిపల్ పరిపాలన పట్టణాభివృద్ధి మంత్రి పొంగూరు నారాయణతో ఈ విషయం తెలియజేయగా సానుకూలంగా స్పందిస్తూ నెల్లూరులో 15000 స్వర్ణకారులని మంగళగిరిలో ఏర్పాటు అవుతున్న కార్పొరేషన్‌కి అనుసంధానం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు సురేంద్ర, చంద్రశేఖర్, కమిటీ మెంబర్లు, స్థానిక వ్యాపారస్తులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## విజయన్‌ని కలిసిన ప్రభాకర్, సురేష్‌లు

**నెల్లూరు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త- వైద్యం :** ప్రభాకర్ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ నెల్లూరు రూరల్ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్‌గా నూతన పదవి బాధ్యతలు స్వీకరించారు. ఆయన డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ కన్స్ట్రక్షన్‌గా పని చేస్తూ బదిలీపై నెల్లూరు రూరల్ సబ్ డివిజన్‌లో కే.సురేష్‌బాబు డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ నెల్లూరు కన్స్ట్రక్షన్ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్‌గా నూతన పదవి బాధ్యతలు స్వీకరించారు. వారు డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ అన్నమయ్య జిల్లాలో పని చేస్తూ బదిలీపై నెల్లూరు కన్స్ట్రక్షన్ డివిన్లో జాయిన్ అయ్యారు. ఈ సందర్భంగా వారు ఇరువురు జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలని అందజేశారు.

## 30వ డివిజన్ దోమలపై దండయాత్ర



**నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** రూరల్ నియోజ కవర్గంలో దోమలపై దండయాత్ర కార్యక్రమాన్ని డివిజన్ నాయకులు యుద్ధ ప్రాతిప దికన కొనసాగిస్తున్నారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆయన సోదరుడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఆదేశాల మేరకు 30 డివిజన్ లోని కొత్తూరు ప్రాంతంలో డివిజన్ ఇన్‌చార్జ్ ఆషిక్ ఖాన్ బిజెపి జనసేన నాయకు లతో కలిసి డివిజన్‌లో దోమల నివారణకు ఆయిల్ బాల్స్, సైడ్ డ్రైన్లలో కిరోసిన్ స్ప్రే, బ్లీచింగ్ పౌడర్ చల్లడం జరిగింది. ఈ సందర్భంగా 30 డివిజన్ ఇన్‌చార్జ్ ఆషిక్ అలీ ఖాన్ మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆలోచించే ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అండదండగా నిలబడే కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఆదర్శంగా తీసుకొని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు క్లస్టర్ 08 ఇన్‌చార్జ్ మన్నేపల్లి రఘు, మాజీ ఏఎంసి చైర్మన్ కూకటి హరిబాబు యాదవ్, 30 వార్డ్ అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్ యనదయ్య, మైనార్టీ నాయకులు జమీర్ భాయ్ , ఇన్చార్జ్ లియాఖత్ అలీ ఖాన్, తురక ఆనందరావు, తురక కృష్ణ, జనసేన పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ నాగరత్నం యాదవ్, 30వ డివిజన్ జనసేన వార్డ్ ఇన్చార్జి షేక్ కరీం, భారతీయ జనతా పార్టీ నాయకులు వెంకట్ రావు, సుబ్బారావు, వేణుగోపాల్, సచివాలయం సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విపిఆర్ ట్రై సైకిల్ పై ఆరా తీసిన ఎమ్మెల్యే



**కొడవలూరు (విడవలూరు), ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** కొడవలూరు గ్రామానికి చెందిన గులాం ఖాదర్ బాషా అనే వికలాంగుడిని కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అభివృద్ధి కార్యక్రమాలకి వెళుతూ గుర్తించి విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఇచ్చిన ట్రై సైకిల్ ఎలా పనిచేస్తుంది అని అడిగి తెలుసుకున్నారు. దీంతో వికలాంగుడు అయినటువంటి ఖాదర్ భాషా మాట్లాడుతూ ట్రై సైకిల్ చిన్నచిన్న రిపేర్లు ఉన్నవి అని చెప్పడంతో ఎమ్మెల్యే స్థానిక నాయకులకు ట్రై సైకిల్‌ను వెంటనే రిపేర్ చేయించి ఇవ్వాలని ఆదేశించారు. వికలాంగుడు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోవూరు వెంకీ, నక్క రమణయ్య, భూలోకం విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉర్దూమీడియం స్కూల్‌ను తొలగించవద్దని ఆందోళన



**అనంతసాగరం, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** అనంతసాగరం మండలం ముస్తాపురం గ్రామంలో శుక్రవారం స్థానిక ప్రజలు ఆందోళన చేపట్టారు. తమగ్రామం నుంచి ఉర్దూమీడియం స్కూల్‌ను తొలగించవద్దని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా ఉన్నఈ స్కూల్లో పిల్లలకు చక్కగా ఉర్దూను బోధిస్తున్నారని , తమ పిల్లలను ప్రవేటు స్కూల్స్ కు పంపకుండా ఉరద్దూ మీడియం స్కూల్లో నే చదివిస్తున్నామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం జిఒనెంబర్ 117ను రద్దుచేసే క్రమంలో మోడల్ స్కూల్స్‌లో ఉర్దూమీడియం స్కూల్స్‌ను విలీనం చేసే క్రమంలో తమ గ్రామంలో ఉండే ఉర్దూ మీడియం స్కూల్‌ను తొలగించకూడదన్నారు. ఈకార్యక్రమంలో బందేఖాన్, కరీంమోహజద్దీన్, రిజ్వాన్, షంషాద్, జమీల, నాగూర్‌సాహెబ్, రఫి తదితరులుపాల్గొన్నారు.

## రేషన్‌షాపును పరిశీలించిన తహసిల్దార్



**ఆత్మకూరు, ఫిబ్రవరి7, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సాధారణ తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఆత్మకూరు తహసిల్దార్ వి.సుధీర్ పట్టణంలోని జెఆర్‌పేట లోని రేషన్‌షాపును తనిఖీ చేశారు. రేషన్ షాపు డీలర్ సుబ్బయ్యను షాపులోని స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. షాపులోని సరుకును, స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఈనెల వచ్చిన రేషన్ సరుకుల వివరాలను లబ్ధిదారులకు అందించిన రేషన్ సరుకుల వివరాల రికార్డును పరిశీలించారు. అనంతరం తహసిల్దార్ వి.సుధీర్ విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్‌షాపుల సాధారణ తనిఖీల్లో భాగంగా పట్టణంలోని 13వ నెంబర్ షాపును తనిఖీ చేశామన్నారు. ఇక్కడ ఉన్న సరుకుల రికార్డుల వివరాలు అన్ని సక్రమంగానే ఉన్నాయన్నారు. రేషన్ డీలర్‌తో మాట్లాడుతూ ప్రతినెల క్రమం తప్పకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు లబ్ధిదారుల కు రేషన్ సరుకులను అందించాలని ఎక్కడా ఎటువంటి అవకతవకలు జరగకుంఠ రేషన్‌షాపు నిర్వహణ ఉండాలని సూచించారు. ఈకార్యక్రమంలో సప్లై డిటి ఎం.డిఆజీజుల్లాఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంఇఒకు ఘన సన్మానం



**అనంతసాగరం, ఫిబ్రవరి7, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన అనంతసాగరంలోని మండల విద్యావనరులకేంద్రంలో శుక్రవారం వైఎస్ఆర్‌టిఎ ఆధ్వర్యంలోజిల్లా ఉత్తమ ఎంఇఒ -2 గా అవార్డు పొందిన కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని శాలువాలు, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌టిఎ రాష్ట్ర కార్యదర్శి మెటుకూరు సుబ్బారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సత్యాల డానియల్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురరాలు నీరుకట్టు శ్రీలత, మండల కన్వీనర్ ఆదిశేషయ్య, సభ్యులు ఎ.సురేష్, రవి, జూనియర్ అసిస్టెంట్ మనోజ్‌కుమార్ లు పాల్గొన్నారు.

### మాలకొండ తలనీలాల వేలాంపాట రూ.2.30కోట్లు మిగిలిన పాటలు వాయిదా



**వలేటివారిపాలెం ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** మండలంలోని మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శుక్రవారం తల వెంట్రుకలుతో పాటు భక్తులు సమర్పించు 11 రకాల ఐటమ్స్‌కు చేపట్టిన వేలం పాటలు ఒక్క తలనీలాల పాట మినహా మిగిలిన అన్ని రకాల పాటలు హెచ్చు పాటదారులు రానందున వాయిదా వేశారు.స్వామివారికి 2025 -26 ఏడాదికిగానూ తలవెంట్రుకలను గుంటూరుకి చెందిన గౌతమబుద్ధప్రాజక్టు వారు సీల్డ్ టెండరు ద్వారా రూ.2,30,10,000లకు స్వాధీన పరుచుకున్నారు. వాయిదా పడిన 11రకాల ఐటమ్‌లు:మిగిలిన 11రకాల ఐటమ్స్‌కు చేపట్టిన బహిరంగ వేలంలో హెచ్చు పాటదారులు రానందున వాయిదా వేశారు. స్వామి వారికి భక్తులు సమర్పించు కొబ్బరిచిప్పలు, వస్త్రాలు ,పాలు, నెయ్యి,పార్కింగు రుసుము వసూలు చేసుకునే హక్కుతోపాటు టెంకాయలు షాపు, పోటోలు ,అద్దములు, పూలు, నిమ్మకాయలు,పూజాసామాగ్రిల షాపు, ఫ్యాన్సీ స్టోర్,టిపిన్‌హోటళ్లు,బొమ్మల అంగళ్లు నిర్వహించుట, పాదరక్షలు మరియు సామాగ్రిని భద్రపరచు హక్కును బహిరంగవేలం వేయుటకు ప్రయత్నించారు. పాటదారులు గత ఏడాది కంటే ఎక్కువగా పాటపాడి కైవసం చేసుకోవడానికి ముందుకు రాలేదు.దీంతో వాయిదా వేసినట్లు అధికారులు ప్రకటించారు. ఈ కార్యక్ర మంలో ఆలయ అధికారులు రవికుమార్, సాగర్‌బాబు, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, రామా రావుల తోపాటు మాజీ ఎంపీటీసీ పొడపాటి నరసింహం, పాటదారులు రఘురామయ్య, శివయ్య, శివకృష్ణ, మహ ంకాళి మల్లికార్జున,తాటికొండ సింహాద్రి, ఇంటూరి శంకర్ ఆలయసిబ్బంది పాల్గొన్నారు.

## నియోజవర్గ నేతలుగా గోపి చంద్రమౌళి

**వలేటివారిపాలెం ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** మండలంలోని సీనియర్ వైస్సార్సీపీ నేత బడేవారిపాలెంకు నివాసి నలమోతు చంద్రమౌళిని కందుకూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడుగానూ,వలేటివారిపాలెం నివాసి మరో సీనియర్ నేత గుత్తా గోపిని పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడుగా నియమించారు. కందుకూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జీ కనిగిరి మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదనయాదవ్ సిఫారసు మేరకు మాజీ ముఖ్యమంత్రి వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ మేరకు నియమించారు.ఇందుకు ఆయా నేతల బందుమిత్రులు సిహెచ్ రాధాకృష్ణ, పార్టీ అధ్యక్షుడు అనుమోలు లక్ష్మీనరసింహం,ఇరపని అంజయ్యతోపాటు పలువురు అభినందించారు. ఇందుకు సహకరించిన బుర్రా మధుసూదన్ యాదవ్‌తోపాటు వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్ఎస్ఆర్‌లో మెగా రక్తదాన శిబిరం



**బిట్రగుంట ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** బోగోలు మండలం కడనూతల గ్రామంలో గల రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నాడు ఫౌండర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అయిన రామిరెడ్డి సుబ్బారెడ్డి జ్ఞాపకార్థం మెగా రక్తదాన శిబిరం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పివిఎన్ రెడ్డి తెలిపారు. ఈ శిబిరం నెల్లూరులో ఉన్న నారాయణ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఎన్ ఎస్ ఎస్ వారి సహాయ సహకారాలతో మెగా రక్తదాన శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిబిరం నందు 147 మంది రక్తమును దానం చేసినట్లు వారు తెలిపారు. ఇప్పటివరకు కళాశాలలో 47 శిబిరాలు నిర్వహించి 2495 బ్యాగులను రక్తం దానం చేసినట్లు వారు తెలిపారు. ఈ శిబిరం నందు కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆర్ వి రమణారెడ్డి కూడా రక్తం దానం చేసినట్లు ఆయన తెలిపారు. రక్తదానం ప్రాణదానం కన్నా మిన్న అని, ఆపదలో ఉన్న వారిని ఆదుకున్న వారు అవుతారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆర్ వి రమణారెడ్డి, అన్ని విభాగాల అధిపతులు, నారాయణ హాస్పిటల్ డాక్టర్ ఏ. యసువర్ధన్ తో పాటు ఆరుగురు సిబ్బంది మరియు ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఏ. కిరణ్ కుమార్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

## దోమల బెడద నుండి కాపాడండి



**బిట్రగుంట ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** బోగోలు మండలం పాత బిట్రగుంట హరిజనవాడ నందు వర్షపు నీళ్ళు నిలబడినందున దోమలు బెడద తీవ్రంగా ఉంది దీంతో ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఈ విషయం పైన సంబదిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## బ్రహ్మోత్సవాల పనులకు శ్రీకారం



**బిట్రగుంట ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** బోగోలు మండలం కొండ బిట్రగుంట నందు వేంచేసి ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు మార్చి నెలలో ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాల కొరకు శుక్రవారం మంగళ ప్రధమ గా పసుపు దంచడము నిర్వహించడం జరిగిందని ఆలయ ఈఓ రాధాకృష్ణ తెలిపారు. దీంతో శ్రీ స్వామి వారి బ్రహ్మోత్సవం పనులు ప్రారంభమైనట్లు ఆయన పేర్కొన్నారు.

## నేడు భీష్మ ఏకాదశి

**- సామూహిక లక్ష్య తులసీ అర్చన**



**కోవూరు, ఫిబ్రవరి 7ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో శనివారం భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి ప్రాత:కాలమునే అభిషేకం , పంచామృతాభిషేక కార్యక్రమాలను నిర్వహింజడం జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యులు తెలిపారు. ఈ భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా సామూహిక లక్ష తులసీ అర్చన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

## చిన్న తరహా గణన పారదర్శకంగా చేపట్టాలి



**కోవూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** కోవూరు మండలంలో త్వరలో చేపట్టనున్న 7వ చిన్న తరహా గణన కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించేలా సంబంధిత గ్రామాల్లోని వీఆర్వోలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని స్టాటికల్ అధికారి శ్యామ్ కుమార్ అన్నారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం కోవూరు మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన వీఆర్వోలతో 7వ చిన్న తరహా గణన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని బోరు బావులు, చిన్న గుంటలు, చెరువులు ఈ చిన్న తరహా గణనలోకి వస్తాయన్నారు. గతంలో 2017-18 సంవత్సరాల్లో ఈ గణన కార్యక్రమం చేపట్టడం జరిగిందని, మరలా ఐదు సంవత్సరాల తర్వాత ఈ గణన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రదానంగా ఈ గణన యొక్క ముఖ్య ఉద్దేశం భూగర్భ జలాల పరిస్థితి ఎంత ఉంది.. ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. బోర్ల కింద ఎంత సాగు చేస్తున్నారు అనే విషయాలను తెలుసుకోవచ్చున్నారు. ప్రతి వీఆర్వో ప్రతి బోరు, ప్రతి చెరువు, ప్రతి కుంట దగ్గర జీపీఎస్ ద్వారా ఫోటో తీసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కోవూరు మండల ఏఎస్‌వో ఈ గణనపై వీఆర్వోలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నిర్మలానందబాబా ఉన్నారు.

## పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి



**కోవూరు, ఫిబ్రవరి 7ప్రభాతవార్త :** కోవూరులోని ఏఎస్‌డబ్ల్యూవో పరిధిలో ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహాల సంక్షేమాధికారులు పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి నూరుశాతం ఫలితాలే ధ్యేయంగా కృషి చేయాలని ఏఎస్‌డబ్ల్యూవో తిరుపతయ్య అన్నారు. కోవూరులోని ఏఎస్‌డబ్ల్యూవో కార్యాలయంలో శుక్రవారం ఏఎస్‌డబ్ల్యూవో పరిధిలో ఉన్న వసతి గృహ సంక్షేమాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పదవ తరగతి పరీక్షలకు 34 రోజులు మాత్రమే గడువు ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి సంక్షేమాధికారి వారి వారి పరిధిలో ఉన్న ఉన్నత పాఠశాలకు ప్రతి రోజూ వెళ్లి తమ విద్యార్థుల యొక్క ప్రగతిని సంబంధిత ఉపాధ్యాయులతో చర్చించాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్దేశించిన మెనూను ప్రతి వసతి గృహంలో తప్పక అమలు చేయాలన్నారు. వసతి గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అనంతరం సంక్షేమాధికారి వారీగా పనితీరుపై సమీక్షించారు. ఈ సమీక్షలో సంక్షేమాధికారులు వెంకట్రావు, వెంటకయ్య, రాంబాబు, నాగరాజు, పద్మ, సుప్రజ, జ్యోతిరాణి, నాగలక్ష్మి, కార్యాలయ పర్యవేక్షకులు దయాకర్‌లు ఉన్నారు.

## రుణాల రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలి



**కోవూరు, ఫిబ్రవరి 7ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో స్త్రీనిధి, ఉన్నతి ఇతర బ్యాంకుల ద్వారా పొదుపు గ్రూపులు తీసుకున్న రుణాల రికవరీపై వీవోఏలు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏపీఎం సుబ్బరాజు అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన వీవోఏలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వీఓఏ వారి వారి పరిధిలో ఉన్న పొదుపు గ్రూపు సభ్యులందరూ అక్షరాస్యులు కావాలన్నారు. ఇప్పటికే దీనికి సంబంధించి వారికి అవగాహన కల్పించి రాత్రి వేళల్లో వారికి అక్షరాస్యతపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ముఖ్యంగా పొదుపు మహిళలను లక్షాధికారిగా అభివృద్ధిలోకి రావాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేలా వారిలో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వీఓఏల వారిగా పనితీరుపై సమీక్షించారు. ఈ సమీక్షలో సంఘమిత్ర అధ్యక్షురాలు లాస్య , సీసీలు రాజశేఖర్, చైతన్యబాబు, రాము, శోభ, తదితరులు ఉన్నారు.

## సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి చొరవ తీసుకుంటాం



**కోవూరు, ఫిబ్రవరి 7ప్రభాతవార్త :** కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి కోట్లాది రూపాయల విలువైన స్థలాన్ని ఉచితంగా ఇచ్చిన కాటంరెడ్డి రంగారెడ్డి మనవడు, కోదండరామ స్వామి ఆలయ పున: నిర్మాణ దాత కాటంరెడ్డి కృష్ణారెడ్డిని శుక్రవారం కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటాచలపతి గౌడ్ ప్రత్యే కంగా కలిశారు. ఈ సందర్భంగా కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన పలు విషయాలను ఆయనతో చర్చించారు. తమవంతుగా ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. తమ తండ్రి జ్ఞాపకార్థం ఆస్పత్రిలో వైద్యుల కొరకు ఒక ప్రత్యేక గది కూడా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కృష్ణారెడ్డి వారికి సూచించారు. అనంతరం కృష్ణారెడ్డిని పూలమొక్కతో అభినందించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ వంశీకృష్ణ ఉన్నారు.

## సర్వే కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలి



**కోవూరు, ఫిబ్రవరి 7ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లాలోని పలు పట్టణాల్లో పీఎంఏవై 2.0 సర్వే కొనసాగుతుందని హౌసింగ్ పీడీ వేణుగోపాల్‌రావు అన్నారు. కోవూరులోని గృహ నిర్మాణ శాఖ డీఈ కార్యాలయంలో శుక్రవారం ఆయన హౌసింగ్ నిర్మాణాలపై సంబంధిత ఏఈలతో ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎంఏవై 2.0 కింద నెల్లూరు జిల్లాకు 2930 గృహాలు మొదటి ఫేస్‌లో ఎంపిక కావడం జరిగిందన్నారు. ఇందులో నెల్లూరుకు 2000, కావలికి 410, బుచ్చికి 130, అల్లూరుకు 90, ఆత్మకూరుకు 100, కందుకూరుకు 200 గృహాలు మంజూరు కావడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఈ పథకం కింద సర్వే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ పథకం కింద నిర్మాణాలు చేపట్టే గృహాలకు కేంద్ర ప్రభుత్వం 1.50 లక్షలు నిధులు మంజూరు చేస్తుండగా.. రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయలు నిధులు మంజూరు చేస్తుందన్నారు. మార్చినాటికి జిల్లాలో 10390 గృహాలు నిర్మాణం పూర్తికావాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. గతంలో ఈ కాలనీల్లో కాంట్రాక్టర్ వ్యవస్థ ద్వారా పలు నిర్మాణ పనులు ఆగి ఉన్నాయని, దీనికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ఈ నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయన్నారు. ఈ సమీక్షలో గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి డీఈ వెంకటేశ్వర్లు రెడ్డి, ఏఈలు మాధవరావు, కేసీ పెంచలయ్య, తదితరులు ఉన్నారు.

## 2 కోట్లతో కూరగాయాల మార్కెటింగ్‌కి భూమి పూజ: ఎమ్మెల్యే




**బుచ్చి ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలో తేజా డెవలపర్స్ వారి దాతృత్వంతో 2 కోట్ల రూపాయాలతో కూరగాయల మార్కెటింగ్‌కి కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి నాయకులు ఘన స్వాగతం పలికారు. భూమి పూజ అనంతరం ఆమె మాట్లాడుతు బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలో మార్కెట్ నిర్మాణానికి 2 కోట్లు వెచ్చించిన తేజా డెవలపర్స్ అధినేత శ్రీనివాసులురెడ్డికి ఆమె ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ఇవ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు. 60 రూమూలు వస్తాయని అన్నారు అనంతరం చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మాట్లాడుతు బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీకి ఒక చరిత్ర ఉందని మాజీ గవర్నర్ బెజవాడ గోపాల్‌రెడ్డి, మాజీ టిడిపినేత బెజవాడ పాపిరెడ్డి లాంటి మహనీయులు నడయాడిన బుచ్చిలో శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నాయకత్వంలో ఎంతో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆమె ప్రశంసించారు. 7 నెలలో ఎంతో అభివృద్ధి చేశారని ఆమె ప్రశంసించారు. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నాయకత్వంలో నేను చైర్‌పర్సన్‌గా పనిచేయడం నా అదృష్టంగా భావిస్తున్నానని ఆమె స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో వైస్ చైర్మన్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ పఠాన్ నస్రీన్, కోడూరు కమలాకర్‌రెడ్డి, కౌన్సిలర్ అందె ప్రత్యూషా, పుట్టా లక్ష్మీకాంతమ్మ, కౌన్సిలర్ రాచూరు సత్యనారాయణ, కౌన్సిలర్ రహమత్, కౌన్సిలర్ శ్రీదేవి, నాగరాజు, కౌన్సిలర్ కోటంరెడ్డి లలితారెడ్డి, బెల్లం మల్లారెడ్డి, నాయకులు ఎం.వి శేషయ్య, జొన్నవాడ దేవస్థానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు, నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, వింజం రామానాయుడు, సూరా శ్రీనివాసులురెడ్డి, రేబాల శ్రీనివాసులురెడ్డి, మైనార్టీనాయకులు పఠాన్ మహబూ భాషా, దుగ్గిశెట్టి హరినాద్, వింజం మహేష్‌నాయుడు, నెల్లూరు దయాకర్‌రెడ్డి, బిజెపి మండల పార్టీ అధ్యక్షులు మనోహర్, శ్రీకాంత్‌రెడ్డి, పలువురు టిడిపినాయకులు కార్యకర్తలు , కూరగాయాల మార్కెట్ రత్నం, శ్రీనివాసులు, తిరిపాలయ్య, ప్రదీప్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌ఆర్ శంకరన్‌ను ప్రతి విద్యార్థి స్ఫూర్తిగా తీసుకోవాలి : ఎమ్మెల్యే



**కావలి, ఫిబ్రవరి7 ప్రభాతవార్త :** దివంగత మాజీ కలెక్టర్ ఎస్‌ఆర్ శంకరన్‌ను ప్రతి విద్యార్థి స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలను అందుకోవాలని కావలి ఎమ్మెల్యే పిలుపుని చ్చారు. కావలి పట్టణ వెంగళరావునగర్‌లోని ప్రభుత్వ బి.సి బాలుర వసతి గృహంలో శుక్రవారం ఎస్‌ఆర్ శంకరన్ రిసోర్స్ సెంటర్‌ను ఎమ్మెల్యే దగుమాటి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. వసతిగృహ అధికారులు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. శ్రీమేధ కరస్పాండెంట్ జానకిరాం వితరణ చేసిన పదవ తరగతి విద్యార్థులకు పరీక్షప్యాడ్లు, పెన్నులను ఎమ్మెల్యే దగుమాటి చేతులమీదుగా విద్యార్థులకు అందచేశారు. హాస్టల్‌లో మరుగుదొడ్లకు డోర్లులేవని వార్డెన్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ప్రభుత్వంతో పనిలేకుండా తన స్వంత నిధులతో డోర్లు ఏర్పాటుచేస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ సందర్భంగా దగుమాటి మాట్లాడారు. విద్యార్థులు ఒక లక్ష్యంతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాలను గుర్తించి ఇష్టంతో చదవాలన్నారు. ఆనాడే తల్లిదండ్రులు, గురువులు సంతోషం వ్యక్తం చేస్తారన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థులకు అన్నివిధాలా టెక్నాలజీతో కూడిన విద్యను అందించేందుకు కృషిచేస్తున్నారన్నారు. తానుకూడా ఒక నిరుపేద కుటుంబానికి చెందినవాడినన్నారు. నేలపై కూర్చొని తల్లిదండ్రుల కష్టాలను గుర్తించి ఇష్టంతో చదివానుకాబట్టి ఈ రోజు కావలి ఎమ్మెల్యేగా ప్రజలకు సేవచేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ బి.సి సంక్షేమాధికారి ఎం.రవి కుమార్, హెచ్‌డబ్ల్యుఓలు చలపతిరావు, జయరామయ్య, కావలి టిడిపి పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోంబాబు, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, 26వవార్డు ఇన్‌చార్జి గంగినేని వెంకటేశ్వర్లు, రాష్ట్ర బిసి అధికారప్రతినిధి బాలగురుస్వామి, రాష్ట్ర ఎస్సీనేత కాకి ప్రసాద్, 19వవార్డు ఇన్‌చార్జి ఏగూరి చంద్రశేఖర్, టిడిపి నాయకులు తిరివీధి ప్రసాద్, ఇస్కా విక్రమ్‌రెడ్డి, ఎ.వెంకటేశ్వర్లునాయుడు, ఆలా శ్రీనివాసులు, ఎస్‌కె.బాష, ఎ.సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని కాపాడుకుందాంకొప్పుల రాజు



**నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** ఏఐసీసీ పిలుపు మేరకు రాజ్యాంగ పరిరక్షణ సదస్సు సిడబ్ల్యుసి శాశ్వత సభ్యుడు కొప్పుల రాజు( రిటైర్డ్ ఐఏఎస్) ఆధ్వర్యంలో జై భీమ్ జై బాపు జై సంవిధాన్ కార్యక్రమం ఇందిరా భవన్‌లో ఘనంగా జరిగింది. అనంతరం కొప్పుల రాజు మాట్లాడుతూ 75 ఏళ్ల స్వతంత్ర భారతావనిని సమైక్యంగా ఉంచిన ఘనత రాజ్యాంగం దేనని అటువంటి రాజ్యాంగాన్ని ప్రసా దించిన రాజ్యాంగ నిర్మాతలను అగౌరవంగా తూలనాడుతూ హేళనగా పార్లమెంట్లో మాట్లాడడం బిజెపి దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. రాజ్యాంగంలోని స్వేచ్ఛ సమానత్వం సౌబ్రతత్వం కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంలోని అన్ని వర్గాలపై ఉందని రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు, దాని గొప్పతనాన్ని గ్రామ మండల స్థాయికి తీసుకువెళ్లేందుకు రాహుల్ గాంధీ ఈ ఏడాది పాటు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారని అన్నారు. ఓబిసి రాష్ట్ర అధ్యక్షుడు సొంటి నాగరాజు మాట్లాడుతూ దేశ సంపదంత కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతమైనదని అన్నారు. పేదరికం నిరక్షరాస్యత నిరుద్యోగం గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ 10 సంవత్సరాల ఎన్డీఏ పాలనలో ప్రజలు భయాందోళనకు లోనవుతున్నారని రాష్ట్ర మైనారిటీ సెల్ అధ్యక్షుడు మస్తాన్ వలి అన్నారు. డిసిసి అధ్యక్షుడు దేవకుమార్ రెడ్డి అధ్యక్షతన ఇందిరా భవన్‌లో జరిగిన కార్యక్రమంనకు విద్యార్థులు, యువకులు, సామాజికవేత్తలు, విద్యావేత్తలు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నట్లు తెలిపారు. భారత రాజ్యాంగానికి బిజెపి ఆర్‌ఎస్‌ఎస్ నుండి కలిగే ప్రస్తుతముప్పుపై ప్రజలందరికీ అవగాహన కల్పించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం ఢిల్లీలో రాహుల్ గాంధీ చేతుల మీదుగా జనవరి 26 నుండి 2026 జనవరి 26 వరకు ప్రారంభించబడినదని జై భీమ్ జై బాపు జై సంవిధాన్ కార్యక్రమం జిల్లా, మండల గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు సంవత్సరం పొడుగునా నిర్వహించబడతాయని డిసిసి తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఉడతా వెంకట్రావు, ఓ బి సి రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, జిల్లా ఇంచార్జ్ ఎం. గోపాల్ రెడ్డి. రాష్ట్ర నాయకులు నరసింహ, నెల్లూరు సిటీ ఇంచార్జ్ కిరణ్ కుమార్ రెడ్డి, ఫయాజ్ శ్రీనివాసులు రెడ్డి అనిల్ రెడ్డి కళ్యాణ్, గౌస్ మొయిద్దీన్ డాక్టర్ యశోదర, హుస్సేన్ బాషా మోహన్ రెడ్డి లీగల్ సెల్ సుధీర్, మీడియా ఇంచార్జి సంజయ్, మల్లికార్జున్ రెడ్డి, ఇర్ఫాన్, ఓ బి సి జిల్లా చైర్మన్ నరేష్, జిల్లా మైనార్టీ చైర్మన్ రెహమాన్, అల్లావుద్దీన్, ఎన్ ఎస్ యు ఐ రాజా, సేవాదళ్ సుజాత, నసీమా, భాను, రిజ్వానా, సోనీ, తదితరులు పాల్గొన్నారు.

## ఆదాలతో కాకాణి భేటీ



**నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు ఆదాల ప్రభాకర్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆదాల క్యాంపు కార్యాలయంలో విచ్చేశారు. ఇరువురు నాయ కులు కలిసి జిల్లాలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను బలోపేతం ఎలా చేయాలన్న దానిపై చర్చిం చుకు న్నారు. జిల్లాలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు కార్యకర్తలపై జరుగుతున్న దాడులను ఎలా ఎదుర్కోవాలి మళ్లీ రాబోయే ఎన్నికల్లో జిల్లాలో అన్ని స్థానాలు వైసిపి కైవసం చేసుకునేలా కార్యాచరణలో ఏం చేయాలో చర్చించుకున్నారు.

## రాష్ట్ర గ్రంథాలయ సంస్థ జిల్లా టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరణ



**నెల్లూరు, ఫిబ్రవరి7, ప్రభాతవార్త – కలెక్టరేట్ :** శుక్రవారం ఏ పీ ఎన్ జీ జీ ఓస్ అసోసియేషన్ భవనం నెల్లూరులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథా లయ సంస్థ ఉద్యోగుల సంఘం జిల్లా టేబుల్ క్యాలెండర్‌ను ఏ పీ ఎన్ జీ జీ ఓస్ అసోసి యేషన్ జిల్లా అధ్యక్షులు మన్నేపల్లి పెంచలరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రం థాలయ ఉద్యోగుల సమస్య అయిన 010 పద్దు కింద జీతాలు వచ్చే విధంగా, అదే విధంగా ఎన్నో సంవ త్సరాలుగా పదోన్నతులకు నోచుకోవడం లేదని మొదలగు సమస్యలను గురించి రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం అయ్యేవిధంగా కృషి చేస్తామని తెలిపారు అనంతరం ఉద్యోగులు ఎన్ జీ జీ ఓ సభ్యత్వం తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ, అసోసియేట్ అధ్యక్షులు నందిమండలం ఆంజనే యవర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్కాకుల పెంచలయ్య, జిల్లా కోశాధికారి వి ఎం వి ప్రసాద్ రెడ్డి సంయుక్త కార్యదర్శులు గిరిధర్, కృష్ణ కుమార్, నగర కోశాధికారి సురేష్ గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు వై విజయ చంద్ర, కార్యదర్శి ఆర్ నాగరాజులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ని సన్మానించిన కొట్టాల గ్రామస్తులు



**బుచ్చి ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని నాగమాంబాపురం పంచాయితీ పరిధిలోని కొట్టాలు గ్రామ ప్రజలుజొన్నవాడ దేవస్థానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యం నాయుడు, కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ నేతృత్వంలో కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పుట్టా సుబ్రమణ్యంనాయుడు మాట్లాడుతు మా గ్రామంలో డంపింగ్ యార్డు ఎంతో ఇబ్బంది కరంగా ఉన్నింది దానిని అక్కడ నుండి తీయించమని అనేక సార్లు గ్రామస్తులు ధర్నాలు చేసినా ఎవ్వరు పట్టించుకోలేదు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వెంటనే స్పందించి కొట్టాలు గ్రామంలో డంపింగ్ యార్డు తీయించినందుకు ఆమెకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



## ఎమ్మెల్యేకు పూల మొక్కను అందజేసిన ఏవో



**కొడవలూరు(విడవలూరు), ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** మండల కేంద్రానికి అభివృద్ధి కార్యక్రమాలకు విచ్చేసిన కోవూరు శాసనసభ్యురాలు ప్రశాంతి రెడ్డికి మండల వ్యవ సాయ అధికారిని సిహెచ్ శ్రీలక్ష్మి స్వాగతం పలుకుతూ పూల మొక్క అందజేశారు. ఈ సందర్భంగా ఎన్నో ఏళ్ల నుండి మరమ్మతులకు గురైన వ్యవ సాయ కార్యాలయం గురించి ఎమ్మెల్యేకు తెలియ పరచగా ఆమె స్పందించి 5 లక్షల రూపాయలు కేటాయించారు. దీంతో నాయకులు, రైతులు, అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

## సిసి రోడ్లు ప్రారంభం ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికిన తహసిల్దార్ ,ఎంపీడీవో



**కొడవలూరు(విడవలూరు), ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** పంచాయతీ పరిధిలో షాది మంజల్, ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు, వ్యవసాయ కార్యాలయం పరిశీలన కార్యక్ర మానికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి రాకతో స్థానిక తహసిల్దార్ స్ఫూర్తి రెడ్డి, ఎంపీడీవో సుబ్బారావు ఘన స్వాగతం పలుకుతూ పూల మొక్క అందజేశారు. ఈ సందర్భంగా షాది మంజల్ పరిశీలన చేసి 5 లక్షలతో సిసి రోడ్లు ప్రారంభించారు. మండల పలు అంశాలపై ఎమ్మెల్యే అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలు శాఖ అధికారులు తదితరులుపాల్గొన్నారు.

## శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి విగ్రహ శిలా ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే



**బిట్రగుంట ఫిబ్రవరి 7ప్రభాతవార్త :** బోగోలు మండలం సోమేశ్వర పురం గ్రామంలో శుక్రవారం శ్రీ కామాక్షి దేవి సమేత శ్రీ సోమేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి విగ్రహ శిలా ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి ఆలయ కమిటీ సభ్యులు, టిడిపి నాయకులు ,గ్రామస్తులు .ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి విగ్రహ శిలా ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని ఆలయ నిర్మాణం మరియు ప్రతిష్ట కార్యక్రమం దాతలు బచ్చు కృష్ణ కుమార్ సంధ్యా దంపతులను ఎమ్మెల్యే అభినందించారు. అమర బచ్చు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మీరు చేస్తున్న సేవ మరవలేనిదని అక్క ఆశయాల కోసం తమ్ముడు చేస్తున్న సేవ అద్భుతం అని అన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గం లో బోగోలు, అల్లూరు మండలాలలో విద్య, వైద్య, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ట్రస్ట్ తరుపున కోట్లాదిరుపాయలు ఖర్చు పెట్టడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ తరుపున కొండ బిట్రగుంట లో రాజగోపురం, బోగోలు లో వైద్యశాల నిర్మించేందుకు ముందుకు రావడం పట్ల వారికి కృతజ్ఞతలు తెలిపారు. స్వార్ధ ప్రయోజనాలకోసం పరుగులు తీసే ఈ రోజుల్లో నిస్వార్ధంగా జన్మనిచ్చిన మండలానికి మౌలిక వసతుల కోసం ఖర్చు చేయడం ఈ ప్రాంతప్రజలు చేసుకొన్నా అదృష్టం అన్నారు. స్వామివారి ఆశీస్సులు కావలి నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని కోరుకున్నానన్నారు. కావలి అభివృద్ధికి నిరంతరం కృషి చేసి కావలిని కాపుకాస్తానన్నారు. ఈ కార్యక్రమం లో తనకు ప్రజలు చూపిన ఆదరణ మరువలేనిదిఅని పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమం లో టిడిపి మండలకన్వీనర్ ఎం. నాగేశ్వరావు, మాజీ ఎం పిటిసి చిలకపాటి వెంకటేశ్వర్లు, ఆలయ ఈఓ రాధాకృష్ణ, కొండబిట్రగుంట ఆలయ ధర్మకర్తలమండలి మాజీ ఛైర్మెన్ శ్రీరామ్ మాల్యాద్రి, విశ్రాంత ఇంజనీర్ గోపిక్రిష్ణ, బోగోలు సాయిమాందిరసేవకులు, గ్రామ టిడిపి నేతలు పాల్గొన్నారు.

## చర్చి వార్షికోత్సవం



**బిట్రగుంట ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** బోగోలు మండలం విశ్వనాధరావుపేట తెలుగు బాపిస్ట్ చర్చి (నార్త్ )95 వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం లో కావలి తెలుగు బాపిస్ట్ చర్చి జి. రోజర్ ప్రశాంగించారు. అనంతరం పేదలకు అన్నదానం, వస్త్రాలు పంపిణిచేశారు. ఈ కార్యక్రమం లో పాస్టర్ ఏబినైజర్, చర్చి చైర్మన్, కార్యదర్శిలు దేవిద్రాజు, చంద్రహస్, ఎల్. సుదీర్ బాబు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## 117 జీవో ఉప సంహరణ సారాంశాన్ని అర్థమయ్యే రీతిలో వివరించాలి



**కోవూరు, ఫిబ్రవరి 7ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 117 ఉప సంహరణ, ఫౌండే షన్ పాఠశాలలు, మోడల్ ప్రైమరీ పాఠశాలలు, బేసిక్ ప్రాథమిక పాఠశాలలు తదితర అంశాలపై ఈ జీవోకు సంబంధించిన సారాంశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు, పాఠశాల విద్యాకమిటీలకు పూర్తి_స్థాయిలో అర్థ మయ్యేలా వివరించా ల్సి న బాధ్యత నియోజకవరనగ పరిధిలోని అన్ని మండలాల్లో ఉన్న మండల విద్యా శాఖ అధికారులు తగు చొరవ తీసుకోవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. నెల్లూరులోని వీపీఆర్ నివాసంలో శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారితో పాటు కోవూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సంబంధించిన ఎంఈవోలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా జారీ చేసిన ఈ జీవోకు సంబంధించిన ప్రతి అంశాన్ని పూర్తిస్థాయిలో అర్థమయ్యేరీతిలో వివరించాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు రవాణా నిమిత్తం ప్రస్తుతం అందిస్తున్న వేతనాన్ని డబ్బు రూపేనా కాకుండా వారి ఇంటి దగ్గర నుంచి పాఠశాలకు వెళ్లేందుకు బస్సులు ఏర్పాటు చేసేలా సంబంధిత విద్యాశాఖ తగు చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఎంతో సదుద్దేశంతో ఈ నూతన విద్యావ్యవస్థకు శ్రీకారం చుట్టిందని, దీనిపై ఉన్న అపోహలను పూర్తిస్థాయిలో తొలగించాల్సిన బాధ్యత సంబంధిత ఎంఈవోలు తీసుకోవాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ బాలాజీరావు, పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ జెట్టి రాజగోపా ల్‌రెడ్డి, నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సంబంధించిన ఎంఈవోలు, ముఖ్య నాయకులు ఉన్నారు.




## ఎమ్మెల్యేను సత్కరించిన జిల్లా విద్యాశాఖ అధికారి



**కోవూరు ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి ని శుక్రవారం వారి నివాసంలో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ బాలాజీ రావు కలసి పూల మొక్కతో ప్రత్యేకంగా అభినందించారు ఈ సందర్భంగా ఆయన ప్రస్తుతం విద్యాశాఖలో వస్తున్న నూతన మార్పులు తది తర అంశాలపై ఎమ్మెల్యేతో ప్రత్యేకంగా సమీక్షించారు

## తెలుగు ఉపాధ్యాయుడు రాజయ్యకు డాక్టరేట్ ప్రధానం



**కావలి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** ఒట్టూరు పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ఆదాల రాజయ్యకు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రధానం చేసింది. కావలి రూరల్ మండలం ఒట్టూరు జెడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తున్న రాజయ్య తెలుగుసాహిత్య లేఖలు–పరిశీలన అనే అంశంపై పరిశోధన చేశారు. ఆయన పలుజాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పత్రసమర్పణ చేశారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్య పరిశోధనా సంస్థలో ఆచార్య పిసి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఆయన పరిశోదనలు చేశారు. మనుబోలు మండలం అక్కంపేట గ్రామానికి చెందిన రాజయ్యకు డాక్టరేట్ లభించడంతో అధ్యాపకులు, పాఠశాల ఉపాధ్యాయులు, స్నేహితులు, కుటుంబసభ్యులు అభినందనలు తెలిపారు.

## జమ్మలపాలెం యిటుకబట్టీల వద్ద న్యాయవిజ్ఞాన సదస్సు



**కావలి, ఫిబ్రవరి07 ప్రభాతవార్త :** హైకోర్టు ఆదేశాలమేరకు కావలి సీనియర్ సివిల్‌జడ్జి ఎం.శోభ సూచనల మేరకు కావలి సమీపంలోని జమ్మలపాలెం యిటుకబట్టీల దగ్గర శుక్రవారం న్యాయవిజ్ఞానసదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లీగల్‌ఎయిడ్ మెంబర్ న్యాయవాది యిస్కల సాయిప్రసాద్, పిఎల్‌వి అశోక్‌లు పాల్గొని చట్టాలపై అవగాహన కల్పిం చారు. బాల్యవివాహాలు, వాటి పరిణామాలు, నిరక్షరా స్యత, వెట్టిచాకిరి నిర్మూలనాచట్టం, బాలకార్మికనిర్మూలన చట్టం, కార్మికులకు ఉన్న చట్టాలు, తదితరవాటిపై అవగాహన కల్పించారు. బడిఈడు పిల్లలను బాగా చదివించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లోక్‌అదాలత్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

## పరీక్షల నిర్వహణలో చీఫ్ సూపరింటెండెట్లదే కీలక పాత్ర



**నెల్లూరు, ఫిబ్రవరి7 ప్రభాతవార్త–విద్య** ఈనెల 10నుండి ప్రారంభం కానున్న ఇంటర్ సైన్స్ విద్యార్థుల ప్రయోగపరీక్షల నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్లదే కీలక పాత్ర అని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని స్దానిక డికే జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఎగ్జామినర్లు, చీఫ్ సూపరింటెండెంట్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రయివేట్ జూనియర్ కళాశాలల్లో ప్రయోగ పరీక్షల నిర్వహణకోసం జూనియర్ లెక్చరర్ స్దాయి అధికారిని ప్రభుత్వ కళాశాలల నుండి చీఫ్‌గా ఎంపిక చేయటం జరుగుతుందన్నారు. పరీక్షల నిర వ్హహణపై అందరి అపోహలు తొలిగిపోయ్యేలా కట్టుదిట్టంగా ఈ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్దులకు ఎటువంటి అసౌకార్యలు కలుగకుండా సిసి కెమెరాల పర్యవేక్షణలో జరిగేలా చూడాలన్నారు. అవకతవకలను పాల్పిడిన కళాశాలల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమెదు చేయటంతోపాటూ ఆయా కళాశాలల అనుమతులు కూడా రద్దుచేయటం జరుగుతుందన్నారు. బోర్డు నిబందనల మేరకు పరీక్షలు పక్కాగా నిర్వహించాలన్నారు. అనంతరం పరీక్షా ప్రతాల డౌన్‌లోడ్, వరీక్షల నిర్వహణ వంటి వాటిపై అవగాహన కల్పించారు. తొలుత కెమిస్ట్రీ, జువాలజీ లెక్చరర్ల కు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు దీన్‌దయాల్, కార్యాలయ సూపరింటెండెంట్ రాజారెడ్డి ప్రయివేట్ కళాశాలల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఒకేషనల్ ప్రయోగపరీక్షలు: గత మూడు రోజులుగా జిల్లాలో జరుగుతున్న ఒకేషనల్ విద్యార్దుల ప్రయోగపరీక్షలు శుక్రవారం కొనసాగాయి. ఉదయం 9నుండి 12 గంటల వరకు జరిగిన పరీక్షల్లో 283మంది విద్యార్దులకు గానూ 265మంది హాజరుకాగా 18మంది గైర్హాజరైయ్యారు. మదా హ్నాం 2 నుండి 5 వరకు జరిగిన పరీక్షల్లో 277మంది హాజరు కవాల్సి ఉండగా 261మంది హాజరు కాగా 16మంది గైర్హాజరైయ్యారు. ఎటువంటి మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదని ఆర్ఐఓ ఆదూరు శ్రీనివాసులు ప్రభాతవార్తకు తెలిపారు.

## కారును ఢీకున్న మినీ లారీ- వ్యక్తికి గాయాలు



సంగం ఫిబ్రవరి 7 ప్రభాతవార్త సంగం జాతీయ రహదారి సర్కిల్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి వున్న కారును మినీ లారీ ఢీకొంది. ఈ సంఘటనలో కారులో ఉన్న వ్యక్తికి స్వల్పగాయాలు అయ్యాయి. కారులో ఎయిర్ బెలూన్లు ఓపెన్ కావడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు సంఘటనా స్దలానికి చేరుకొని వివరాలు స్వీకరిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## బిసి కాలనీలోనే పాఠశాలను కొనసాగించాలి



**మనుబోలు ఫిబ్రవరి 7 ప్రభాతవార్త** మనుబోలు బిసి కాలనీలోనే స్దానిక ప్రభుత్వ పాఠశాలలో 3,4,5 తరగతులు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలను ఇక్కడే కొనసాగించాలని ఎంఇఓ వేణుగోపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం విద్యాశాఖలో నూతనంగా ఇచ్చిన జీవో ప్రకారం మూడు నాలుగు ఐదు తరగతుల విద్యార్థులను మెడల్ స్కూల్‌లలో కలిపే ఉద్దేశం ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను వేరో పాఠశాలకు పంపితే మాకు చాలా ఇబ్బంది కలుగుతుందని పిల్లలు వేరే పాఠశాలకు వెళ్లాలంటే సుమారు రెండు కిలోమీటర్లు మేర దూరం ఉందని అంతే కాకుండా జాతీయ రహదారి ద్వారా వెళ్లాలసి వస్తుందని పాఠశాలకు వెళ్ళే వచ్చే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అర్జీ ద్వారా పేర్కున్నారు. అంతేకుండా మేము కూలి పనులు చేసుకుంటు పిల్లలను చదివించుకుటున్నామని వారి ఎంఇఓకి వివరించారు.

## బుచ్చిలో అగ్ని మాపక కేంద్రం



**బుచ్చి ఫిబ్రవరి 7 ప్రభాతవార్త** నగర పాలక పంచాయితీలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేసేందుకు ఇటీవల ఎమ్మెల్యే అడుగులు వేశారు. ఈ మేరకు అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ వేణుగోపాల్ సిబ్బందితో కలిసి పట్ట ణంలో పలుస్థలాలుపరిశీలిం చారు. పరిశీలించిన స్దలాలను నగరపంచాయితీ కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. శాంతినగర్‌లో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటుచేసేందుకు త్వరలోనే చర్యలుతీసు కుం టామని అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ వేణుగోపాల్ తెలిపారు. స్దలం పరిశీలించిన విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. తాత్కాలిక స్దలాన్ని కేటాయించి వాహనాన్ని త్వరలో పట్టణానికి తీసుకొని వస్తా మని చెప్పారు.